PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

సిటీ◆

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 110 | విజయవాడ, సోమవారం 21 నవంబర్ 2022 | 6 + 8 పేజీలు వెల : 5. 50

Vol No | Vijayawada, Monday 21 November 2022 | Rs

చిరంజీవికి ఇండియన్ ఫిల్మ్ పర్సనాలిటీ పురస్కారం

• లోపలి పేజీలో.. •

ధాన్యం రైతులపై పిడుగు

ఎకరానికి 26 క్వింటాళ్లే కొనుగోలు • రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం

కృష్ణా జిల్లా బాపులపాడు మండలం సిరివాడ గ్రామానికి చెందిన వై.కొండలరావు రెండు ఎకరాల్లో వరి సాగు చేశారు. 58.5 క్వింటాళ్లకుపైగా దిగుబడి వచ్చింది. ఎకరానికి 26 చొప్పున 52 క్వింటాళ్లు మాత్రమే రైతు భరోసా కేంద్రం (ఆర్‌బికె) ద్వారా అమ్ముకోగలిగారు. మిగిలిన 6.5 క్వింటాళ్ల ధాన్యం రైతు వద్ద మిగిలిపోయింది. ఆరుగొలను గ్రామానికి చెందిన బి.చలమయ్య మూడు ఎకరాలు కౌలుకు తీసుకుని వరి సాగు చేశారు. 83.25 క్వింటాళ్లకుపైగా దిగుబడి వచ్చింది. 78 క్వింటాళ్లు మాత్రమే ఆర్‌బికె ద్వారా అమ్ముకోగలిగారు. ఈ ఇద్దరు రైతుల పరిస్థితే కాదు... కృష్ణా జిల్లాలో పంట నూర్పిడి పూర్తయిన అన్ని ప్రాంతాల్లోనూ రైతులు ఈ సమస్య ఎదుర్కొంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎకరాకు 26 క్వింటాళ్లు మించి కొనకూడదంటూ ఆర్‌బికె సిబ్బందిపై ఆంక్షలు పెట్టడమే దీనికి కారణం.

పూర్తి స్థాయిలో సేకరించాలి

వాతావరణం అనుకూలించడంతో ఈ ఏడాది ధాన్యం దిగుబడులు పెరిగాయి. ఎకరానికి 26 క్వింటాళ్ళు మాత్రమే కొనుగోలు చేస్తామని ఆర్‌బికెల్లో చెపుతున్నారు. రైతులు అమ్మదల్చుకున్న ధాన్యాన్ని పూర్తి స్థాయిలో ప్రభుత్వం మద్దతు ధరకు సేకరించాలి.

-పంచకర్ల రంగారావు, ఎపి కౌలు రైతు సంఘం కృష్ణా జిల్లా కార్యదర్శి

ప్రభుత్వానికి నివేదిక పంపాం

ఎకరానికి 26 క్వింటాళ్లు రైతుల నుంచి సేకరించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఈ ఏడాది ధాన్యం దిగుబడులు పెరిగాయి. ఎకరానికి 30 క్వింటాళ్లు వస్తున్నాయని రైతులు చెబుతున్నారు. సమస్యపై ప్రభుత్వానికి నివేదిక ఇచ్చాం. త్వరలోనే సమస్య పరిష్కారం అవుతుంది.

- ఎ.శ్రీధర్, పౌర సరఫరాల సంస్థ కృష్ణా జిల్లా మేనేజర్

ప్రజాశక్తి- కృష్ణా ప్రతినిధి

రైతుల నుండి ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం ఆచరణలో దానికి భిన్నంగా వ్యవహరిస్తోంది. రైతుల నుండి ఎకరాకు 26 క్వింటాళ్ల మాత్రమే కొనుగోలు చేయాలని తాజాగా ఆదేశాలు జారీ చేసింది. ఎకరాకు దాదాపు 30 క్వింటాళ్ల దిగుబడి రావడంతో ప్రభుత్వ నిర్ణయం రైతులకు పిడుగుపాటుగా మారింది. గత ఏడాది కూడా రాష్ట్ర ప్రరుభుత్వం ఎకరాకు 30 క్వింట్యాను రైతుల నుండి కొనుగోలు చేసింది. దీంతో ఈ ఏడాది కూడా ఆ మేరకు కొనుగోళ్లు ఖచ్చితంగా ఉంటాయని రైతులు భావించారు. ముఖ్యమంత్రి పదేపదే నిర్వహించిన సమావేశాల్లో సైతం ఆర్‌బికెల్లోనే ధాన్యం కొనుగోళు జరగాలని, దళారులు లేకుండా చూడాలని ఆదేశించడం కూడా రైతుల్లో నమ్మకాన్ని పెంచింది. అయితే, వాస్తవంగా కొనుగోళ్ల ప్రక్రియ ప్రారంభమయ్యే సమయానికి ఆపరిస్థితి మారింది. పైనుండి వచ్చిన ఆదేశాల ప్రకారం 26 క్వింటాళ్లనే కొనుగోలు చేస్తామని, మిగిలిన వాటిని బయట అమ్ముకోవాలని సిబ్బంది చెబుతున్నారు. దీంతో మిగిలిన ధాన్యాన్ని అనివార్యంగా ప్రైవేటు వ్యాపారులకు, దళారులకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ ఏడాది వాతావరణం కూడా బావుండటంతో ధాన్యం దిగుబడి గణనీయంగా వచ్చిందని, అయితే, ఆ మేరకు కొనుగోళ్లు లేకపోవడంతో నష్టపోవాల్సి వస్తోందని రైతులు చెబుతున్నారు. క్వింటాలుకు సాధారణ రకానికి రూ.2,040, 'ఎ' గ్రేడ్ రకానికి రూ.2,060 చొప్పున ప్రభుత్వం మద్దతు ధర నిర్ణయించింది. ఆర్‌బికెల ద్వారా రైతుల నుంచి ధాన్యాన్ని సేకరిస్తోంది. ఆర్‌బికెలకు అమ్మగా మిగిలిన ధాన్యాన్ని తగ్గించి అమ్ముకోవాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కృష్ణా జిల్లాలో 'ఎ' గ్రేడ్ రకం ధాన్యాన్ని ఎక్కువగా సాగు చేస్తున్నారు. రైతులు వద్ద మిగిలిన ఈ రకం ధాన్యాన్ని దళారులు రూ.300 వరకు తగ్గించి రూ.1,760కు కొనుగోలు చేస్తున్నారు. దీంతో, రైతులు ఆ మేరకు నష్టపోతున్నారు. జిల్లాలో ఈ సీజన్లో 3,91,135 ఎకరాల్లో వరి సాగైంది. పలు ప్రాంతాల్లో కోతలు మొదలయ్యాయి. ఇ క్రాప్‌లో నమోదైన విస్తీర్ణానికి సంబంధించి ప్రభుత్వం నిర్దేశించిన మొత్తాన్ని మాత్రమే ఆర్‌బికెల ద్వారా కొనుగోలు జరుగుతోంది. పౌర సరఫరాల సంస్థ గతేడాది జిల్లాలో 4.50 లక్షల టన్నుల ధాన్యాన్ని సేకరించింది. ఈ ఏడాది 4.10 లక్షలకు లక్ష్యాన్ని ప్రభుత్వం పరిమితం చేసింది. ఎరువులు, పురుగుల మందులు, ఇతర ఖర్చులు పెరుగుతుండ డంతో సాగు ఖర్చులు అధికమవుతున్నాయి.

దక్షిణ కోస్తాకు వాయు'గండం'

• నేడు, రేపు భారీ వర్షాలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

బంగాళాఖాతంలో నెలకొన్న వాయుగుండం కారణంగా రానున్న 48 గంటల పాటు దక్షిణ కోస్తా జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ఈ మేరకు ఆ సంస్థ ఎండి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. వాయుగుండం ప్రభావం తమిళనాడుపై కూడా తీవ్రంగా ఉండే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఇండియన్ మెట్రోలాజికల్ డిపార్ట్‌మెంట్ (ఐఎండి) తెలిపిన వివరాల ప్రకారం నైరుతిని ఆనుకుని ఉన్న ఆగ్నేయ బంగాళాఖాతంలో వాయుగుండం కొనసాగుతోందని పేర్కొన్నారు, ప్రస్తుతానికి జాఫ్నా (శ్రీలంక)కు తూర్పున600 కిలోమీటర్లు, తూర్పు ఆగ్నేయంగా కారైకాల్‌కు 630కిలోమీటర్లు, చెన్నైకి 670 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమైందని తెలిపారు. రాగల 48గంటల్లో వాయుగుండం నెమ్మదిగా కదులుతూ తమిళనాడు, దక్షిణ కోస్తాంధ్ర తీరాలవైపు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. దీని ప్రభావంతో సోమ, మంగళవారాల్లో దక్షిణ కోస్తాలోని ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాలతో పాటు రాయలసీమలోని చిత్తూరు, వైఎస్ఆర్, అన్నమయ్య జిల్లాల్లో కూడా భారీ వర్షాలు పడే అవకాశముందని తెలిపారు. ముందస్తు చర్యల కోసం సంబంధిత జిల్లాల యంత్రాంగాన్ని అప్రమత్తం చేసినట్టు పేర్కొన్నారు. మత్స్యకారులు మంగళవారం వరకు దక్షిణ కోస్తా-తమిళనాడు తీరం వెంబడి వేటకు వెళ్లరాదన, వర్షాల నేపథ్యంలో ప్రజలు, రైతులు, అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణా సంస్థ ఎండి సూచించారు.

అంబరాన్నంటిన ఫిఫా సమరోత్సాహం

• ఖతర్‌లో అద్వితీయంగా ప్రారంభోత్సవం

ఎన్నర్ వాలెన్సియా

ఫిఫా ప్రపంచకప్ ఫుట్‌బాల్ క్రీడా వేడుకలు ఖతర్‌లో ఆదివారం అంబరాన్నంటేలా అద్వితీయంగా ప్రారంభమయ్యాయి. పశ్చిమాసియాలోనే తొలిసారి ఈ వేడుకులకు ఆతిథ్యమిస్తున్న ఖతర్‌కు వివిధ దేశాల అధినేతలు, రాజకీయ ప్రముఖులు, ఫుట్‌బాల్ క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అరేబియా సంస్కృతి, సాంప్రదాయాలను ప్రతిబింబించేలా 'ప్రతి ఒక్కరికీ స్వాగతం' థీమ్‌తో నిర్వహించిన కళా ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ప్రఖ్యాత సంగీత బృందం బిటిఎస్‌కు చెందిన జంగ్ కుక్.. ఖతర్ గాయకుడు ఫహద్ అల్ కుబైసితో కలిసి ప్రేక్షకులను ఉర్రూతలూగించారు. భారత్ నుంచి ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్ ఈ వేడుకలకు హాజరయ్యారు.

తొలిమ్యాచ్‌లో అదరగొట్టిన ఈక్వెడార్

ఫిఫా ప్రపంచకప్ తొలి మ్యాచ్ ఆతిథ్య దేశం ఖతర్‌కు, ఈక్వెడార్‌కు మధ్య జరిగింది. ఈక్వెడార్‌కు చెందిన ఎన్నర్ వాలెన్సియా టోర్నమెంటులో తొలి రెండు గోల్స్ చేసి సంచలనం సృష్టించాడు. దీంతో మ్యాచ్ తొలి అర్ధభాగంలో ఖతర్‌పై ఈక్వెడార్ పైచేయి సాధించి ముందజలో నిలిచింది.

• లోపలి పేజీలో.. •

సర్వం సిద్ధం

• నేటి నుంచి కౌలు రైతు సంఘం రాష్ట్ర మహాసభ

• చిలకలూరిపేటలోని నన్నపనేని వెంకటరత్నం కన్వెన్షన్‌లో ఏర్పాట్లు

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

• గిరిజన విద్యారంగ రాష్ట్ర విద్యా సదస్సులో ఎమ్మెల్సీలు షేక్ సాబ్జీ, ఐవి

ఆర్‌బిఐకి చెప్పకుండానే ఎన్నికల బాండ్ల గడువు పెంపు..

న్యూఢిల్లీ : గుజరాత్, హిమాచల్ ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు మరికొద్ది రోజుల్లో ఉన్నాయనగా కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఎన్నికల బాండ్ల గడువు పెంచడం వివాదాస్పదంగా మారింది. ఆర్‌బిఐ చట్టం 1934లోని సెక్షన్ 31 ద్వారా దఖలుపడిన అధికారాల్ని ఉపయోగించుకొని 2018లో ఈ పథకాన్ని మోడీ సర్కార్ తీసుకొచ్చింది. ఏటా జనవరి, ఏప్రిల్ జులై, అక్టోబర్‌లో బాండ్ల అమ్మకాల్ని చేపట్టవచ్చు. ఈ గడువు ఎట్టి పరిస్థితుల్లో పెంచరాదని 2019 ఏప్రిల్ 12న సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. ఈ ఏడాది అక్టోబర్‌లో చేపట్టిన 10 రోజుల అమ్మకాలతో పథకం గడువు ముగిసినా, మరో 15 రోజులు అదనంగా బాండ్ల అమ్మకాన్ని చేపడతామని ఈ నెల 7న కేంద్రం నోటిఫికేషన్ జారీచేసింది. ఈ విషయాన్ని ముందుగా కేంద్ర ఎన్నికల సంఘానికే మోడీ సర్కార్ తెలియజేసిందని, ఆర్‌బిఐ ఆమోదం తీసుకోలేదనే విషయం తాజాగా వెలుగుచూసింది. సామాజిక కార్యకర్త లోకేశ్ కె.బాత్రా దాఖలు చేసిన ఆర్‌టిఐ దరఖాస్తుకు కేంద్ర ఆర్థిక శాఖ ఈ మేరకు సమాచారం తెలియజేసింది.

ప్రమాదం జరిగిన అంబికా జ్యూయలర్స్ ప్రాంతమిదే...

మల్లేశ్వరరావు

మౌలేష్

నర్సీపట్నంలో విషాదం

• అగ్ని ప్రమాదంలో తండ్రి, కుమారుడు దుర్మరణం

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్ (అనకాపల్లి)

అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలో ఆదివారం తెల్లవారుజామున విషాదం చోటు చేసుకుంది. తండ్రి, కుమారుడు అగ్ని ప్రమాదంలో చిక్కుకొని ఊపిరాడక చనిపోయారు. పోలీసుల కథనం ప్రకారం... నర్సీపట్నంలోని కృష్ణ బజార్ సెంటర్‌లో అంబికా జ్యూయలర్స్ పేరిట నవర మల్లేశ్వరరావు (45) బంగారం వ్యాపారం నిర్వహిస్తున్నారు. ఆ దుకాణంపైనే ఉన్న రెండంతస్తుల భవనంలో ఆయన తన కుటుంబంతో నివసిస్తున్నారు. శనివారం సాయంత్రం దుకాణం మూసేసి పైఅంతస్తులోని ఇంటికి వెళ్లారు. ఆదివారం తెల్లవారుజామున మూడు గంటల సమయంలో ఇల్లంతా దట్టమైన పొగలు వ్యాపించడంతో ఈ విషయాన్ని మల్లేశ్వరరావు తన సోదరునికి ఫోన్‌లో తెలియజేశారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి వచ్చే సరికే మల్లేశ్వరరావు మృతి చెందారు. ఆయన కుమారుడు మౌలేష్ (17)ను ఇంటి నుంచి వెలుపలికి తీసుకొస్తుండగా మరణించారు. మల్లేశ్వరరావు భార్య సుజాత, కుమార్తె జాహ్నవిని అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు కాపాడగలిగారు. వారిని మెరుగైన చికిత్స కోసం విశాఖకు తరలించారు. విద్యుత్తు షార్ట్‌సర్క్యూట్ కారణంగా తలెత్తిన పొగ, మంటల కారణంగా ఊపిరాడక తండ్రీ కొడుకులు మృతి చెందారని పోలీసులు తెలిపారు. మౌలేష్ దువ్వాడలోని విజ్ఞాన్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ రెండో సంవత్సరం చదువుతున్నారు. ఆదివారం సెలవు దినం కావడంతో శనివారం రాత్రి తొమ్మిది గంటలకు ఇంటికి వచ్చాడని బంధువులు తెలిపారు. నర్సీపట్నం పట్టణ సిఐ గణేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు ప్రజా ఉద్యమం

• 'విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు మహోద్యమం' సదస్సులో వక్తలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

మాట్లాడుతున్న మాజీ ఎంపి ఉండవల్లి అరుణ్ కుమార్, వేదికపై ఆర్ నారాయణమూర్తి, లక్ష్మీనారాయణ, రమణమూర్తి

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ కాకుండా నడుస్తున్న ఉద్యమాన్ని ప్రజా ఉద్యమంగా మార్చాల్సిన అవసరం ఎంతైనా ఉందని, అప్పుడే కేంద్రం దిగివస్తుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. 'విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు మహోద్యమం' పేరిట రైటర్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం విశాఖలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో సదస్సు జరిగింది. రైటర్స్ అకాడమీ ఛైర్మన్, లీడర్ పత్రిక సంపాదకులు వివి రమణమూర్తి అధ్యక్షత వహించిన ఈ సదస్సులో మాజీ ఎంపి ఉండవల్లి అరుణ్ కుమార్ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ వల్ల కేవలం అందులో పని చేస్తున్న ఉద్యోగులకే కాకుండా ప్రజానీకానికీ తీవ్ర నష్టం కలుగుతుందని తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరణ చేయాలంటే రాజ్యాంగ సవరణ చేయాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకొని మూడు నల్ల వ్యవసాయ చట్టాలను మోడీ ప్రభుత్వం వెనక్కి తీసుకుందని, దానికి కారణం రైతులు సాగించిన పోరాటమేనని అన్నారు. స్టీల్‌ప్లాంట్ సంరక్షణకు అటువంటి పోరాటాలు చేయక తప్పదని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో అధికార పార్టీ కంటే ప్రతిపక్షం బలంగా ఉండాలన్నారు. కమ్యూనిస్టులు బలంగా ఉంటే మోడీ వంటి నియంతల ఆటలు సాగవని చెప్పేందుకు కేరళ రాష్ట్రమే ఉదాహరణని తెలిపారు. అక్కడ హిందూస్తాన్ న్యూస్‌ప్రింట్ ప్రభుత్వ రంగ సంస్థను అమ్మేందుకు కేంద్రంలోని బిజెపి ప్రయత్నించగా స్థానిక కమ్యూనిస్టు ప్రభుత్వం దానికి ఒప్పుకోలేదని, రాష్ట్ర ప్రభుత్వమే టేక్‌ఓవర్ చేసుకుని తిరిగి ప్రారంభించిందన్నారు. బిజెపి పెట్టుబడిదారుల అనుకూల పార్టీ అనే విషయాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లాలని సూచించారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ చేయరాదంటూ వైజాగ్ డిక్లరేషన్ ప్రకటించి ఆ దిశగా పోరాటం ఉధృతం చేయాలన్నారు. దేశంలో అన్ని సహజ వనరులకు హక్కుదారులు ప్రజలేనని తెలిపారు. విప్లవ నటుడు ఆర్ నారాయణమూర్తి మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారం ప్రభుత్వ రంగంలోనే ఉంటుందని కేంద్రం ప్రకటించే వరకూ ఉద్యమం కొనసాగాలన్నారు. విద్య, వైద్యం, బీమా, బ్యాంకులు, ఎయిర్ పోర్టులు.. ఇలా మొత్తం అన్నింటినీ ప్రయివేటీకరణ చేస్తూ మోడీ ప్రభుత్వం రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడుతోందని విమర్శించారు. ఉక్కు నిర్వాసితుల త్యాగాలను మోడీ ప్రభుత్వం గుర్తించాలన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని మిగతా 2లో

విభజన రాజకీయాలను తిప్పికొట్టండి

సిలిగురిలో సిపిఎం భారీ ర్యాలీ

సిలిగురి : పశ్చిమ బెంగాల్‌లో బిజెపి, తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) విభజన రాజకీయాలను తిప్పికొట్టాలని సిపిఎం పిలుపునిచ్చింది. పశ్చిమ బెంగాల్ సిలిగురిలో సిపిఎం ఆధ్వర్యాన భారీ ర్యాలీ నిర్వహించారు. అక్కడి బాగజతిన్ పార్కులో నిర్వహించిన బహిరంగ సభకు ప్రజానీకం భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ బిజెపి, టిఎంసిలు ప్రజలను కులాలు, మతాల పేరుతో విభజించి, వారి మధ్య కలహాలు సృష్టించి లబ్ధిపొందేందుకు చేస్తున్న ప్రయత్నాలను తిప్పికొట్టాలని కోరారు. సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి మహ్మద్ సలీం, పార్టీ నాయకులు అశోక్ భట్టాచార్య, జివిఎస్ సర్కార్, మీనాక్షి ముఖర్జీ తదితరులు ప్రసంగించారు.

విద్యార్థులకూ ఫేసియల్ అటెండెన్స్

• ఉన్నత విద్యా మండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

విద్యార్థులకూ ఫేసియల్ రికగ్నైజేషన్ అటెండెన్సును అమల్లోకి తీసుకురానున్నట్లు ఉన్నత విద్యామండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి తెలిపారు. తాజాగా దీన్ని విద్యార్థులకు అమలు చేసే ప్రక్రియను ప్రారంభించాలని నిర్ణయించినట్టు చెప్పారు. అనంతపురం నగరానికి వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇప్పటి వరకు ఉపాధ్యాయులకు మాత్రమే ఈ విధానం అమల్లో ఉందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు విధులకు హాజరైన వెంటనే ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో ఫేసియల్ రికగ్నైజేషన్ అటెండెన్సు వేయాల్సి ఉంటుందన్నారు. దీన్ని విద్యార్థులకు కూడా అమలు చేసే ప్రక్రియను ప్రారంభించాలని నిర్ణయించామని చెప్పారు. డిగ్రీ ఆపై స్థాయి విద్యార్థులకు దీన్ని అమలు చేయనున్నట్లు తెలిపారు. అధ్యాపకులు ఉదయాన్నే తరగతి గదిలోకి వచ్చిన వెంటనే ఫేసియల్ యాప్ ద్వారా రెండు నిమిషాల పాటు తరగతి గది మొత్తాన్ని వీడియో తీసి అప్‌లోడ్ చేయాలన్నారు. ఇందులో హాజరైన విద్యార్థులందరి ఫేస్ రికగ్నైజేషనై హాజరు నమోదవుతుందని తెలిపారు. ఈ ప్రక్రియను ఈ నెలాఖరు నుంచి ప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోందన్నారు. రాష్ట్రంలో సుమారు మూడున్నర లక్షల మంది విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారని, ఇప్పుడు వారంతా విధిగా తరగతులకు హాజరు కావాల్సి ఉందని తెలిపారు. కొన్ని కళాశాలల్లో విద్యార్థులు తరగతులకు హాజరుకాకపోయినా ప్రయివేటు విద్యా సంస్థలు కొన్ని హాజరు నమోదు చేస్తున్నాయని, విద్యార్థుల హాజరు చూపించి ఫీజు రీయింబర్సుమెంటు వంటివి కూడా పొందుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలో వీటిని కట్టడి చేయడంతోపాటు, విద్యార్థులు విధిగా తరగతులకు హాజరవడం ద్వారా సరైన విద్యా నైపుణ్యత పెంపొందించే అవకాశముంటుందని తెలిపారు.

ఫిర్యాదు చేసిన కాశ్మీరీ జర్నలిస్టుల ఇళ్లపైనే పోలీసుల దాడులు

న్యూఢిల్లీ : ఉగ్రవాద సంస్థలు ఆన్‌లైన్‌లో బెదిరిస్తున్నాయని ఫిర్యాదు చేసిన 12 మంది జర్నలిస్టులు, కొందరు న్యాయవాదుల నివాసాలపై జమ్ముకాశ్మీర్ పోలీసులు దాడులు చేశారు. శ్రీనగర్, అనంతనాగ్, కుల్‌గామ్ జిల్లాల్లోని 10 ప్రాంతాల్లో శనివారం దాడులు నిర్వహించి, జర్నలిస్టుల ల్యాప్‌టాప్‌లు, ఫోన్లు, మెమొరీ కార్డులు, పెన్ డ్రైవ్‌లు, డాక్యుమెంట్లు, రబ్బరు స్టాంప్‌లు, పాస్‌పోర్టులు తదితరాలను సీజ్ చేసినట్లు జమ్ముకాశ్మీర్ పోలీసులు ట్వీట్ చేశారు. భారత భద్రతా దళాలకు సహకరిస్తూ, తప్పుడు కథనాలు రాస్తున్నారని ఆరోపిస్తూ పాకిస్థాన్‌కు చెందిన లష్కరే తోయిబా, ది రెసిస్టెన్స్ ఫ్రంట్ (టిఆర్ఎఫ్) ఆన్‌లైన్‌లో జర్నలిస్టులను బెదిరించాయి. జర్నలిస్టు సాజాద్ అహ్మద్ క్రల్యారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 370 ఆర్టికల్ రద్దును వ్యతిరేకిస్తున్న రచయిత గౌహర్ గిలాని, జర్నలిస్టులు హకీమ్ రషీద్ మక్బూల్, ఖలీద్ గుల్, ఖాజీ షిబ్లీ, వసీమ్, రాజా, టర్కీకి చెందిన కాశ్మీరీ సంతతి ఫొటో జర్నలిస్టు ముక్తార్ అహ్మద్ బాబా నివాసాలపై పోలీసులు దాడులు చేశారు.

పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం

గిరిజన విద్యారంగ రాష్ట్ర విద్యా సదస్సులో పిడిఎఫ్ ఎమ్మెల్సీలు షేక్ సాబ్జీ, ఐవి

ప్రజాశక్తి- పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా)

గిరిజన విద్యాలయాల్లో తగిన సౌకర్యాలు లేవని, పోరాటాలతోనే విద్యారంగ సమస్యలు పరిష్కారమవుతాయని పిడిఎఫ్ ఎమ్మెల్సీలు షేక్ సాబ్జీ, ఐ.వెంకటేశ్వరరావు అన్నారు. గిరిజన విద్యారంగ సమస్యల పరిష్కారానికి యుటిఎఫ్ ఆధ్వర్యాన అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులోని కాఫీ హౌస్‌లో రాష్ట్ర స్థాయి విద్యా సదస్సు ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా షేక్ సాబ్జీ మాట్లాడుతూ గిరిజన విద్యారంగ సమస్యలపై రాష్ట్రంలో ఏడు రోజులపాటు జీపు జాతా నిర్వహించామని, 50 గిరిజన ఆశ్రమ పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయుల, విద్యార్థుల, పాఠశాలల సమస్యలను గుర్తించి ప్రభుత్వానికి నివేదించామని తెలిపారు. ప్రభుత్వంలో కదలిక వచ్చి 600 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ప్రతిపాదనలు చేసిందన్నారు. గిరిజన విద్యాభివృద్ధికి మరిన్ని పాఠశాలలు, వసతి గృహాలు నెలకొల్పాల్సిన అవసరం ఉందని తెలిపారు.

హాస్టళ్లలో గిరిజన విద్యార్థులకు కాస్మోటిక్ ఛార్జీలు నిలిపివేశారన్నారు. గిరిజన ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతులు, ఎఎన్ఎం, కమాటి తదితర పోస్టుల భర్తీకి పోరు సాగించాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీల అమలులో ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి విఫలమయ్యారని విమర్శించారు. ఆదివాసీలను పాలకులు దగా

పాడేరులో నిర్వహించిన భారీ ర్యాలీలో ఎమ్మెల్సీలు షేక్ సాబ్జీ, ఐవి, ఉపాధ్యాయులు

చేస్తున్నారన్నారు. ప్రభుత్వాలకు ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం పట్ల చిత్తశుద్ధి లేదని తెలిపారు గిరిజన ప్రాంతాల్లో గిరిజనులకే ఉద్యోగావకాశాలివ్వాలని డిమాండ్ చేశారు. ఆదివాసీలకు ఐదో షెడ్యూల్ ఆత్మలాంటిదన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గిరిజన ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ఉద్యమిస్తామన్నారు. పాడేరు ఐటిడిఎ పరిధిలో భాషా వలంటీర్లను రెన్యువల్ చేసేందుకు జిల్లా కలెక్టర్ చొరవ చూపినా ఐటిడిఎ పిఒ అడ్డుపుల్ల వేస్తున్నారని తెలిపారు. ఐటిడిఎను ముట్టడించైనా రెన్యువల్ జరిగే వరకూ పోరాడుతామన్నారు. ఆర్థిక పరిస్థితుల వల్ల గిరిజన బిడ్డలు చదువుకు దూరమవుతున్న పరిస్థితి అనేక ప్రాంతాల్లో ఉందని తెలిపారు. ఎపి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర మాట్లాడుతూ జిఒ నెంబర్ 3ని పునరుద్ధరించే వరకూ గిరిజనులు పోరాడాలని కోరారు.

డిసెంబర్‌లో ఉద్యమం ఉధృతం

యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం సిద్ధించి 75 ఏళ్లవుతున్నా గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి కానరావడం లేదన్నారు. గిరిజన విద్యారంగ సమస్యల పరిష్కారానికి వచ్చే నెల 12న ఐటిడిఎల ముట్టడికి, 22న విజయవాడలోని గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయం ముట్టడికి ఉపాధ్యాయులు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. సదస్సులో పలు జిల్లాల యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. సదస్సుకు ముందు పాడేరు ఐటిడిఎ నుంచి కాఫీ హౌస్ వరకూ ఉపాధ్యాయులు భారీ ర్యాలీ నిర్వహించారు.

తీర్మానాలు

విద్యా సదస్సులో యుటిఎఫ్ పలు తీర్మానాలను ఆమోదించారు. ఐదేళ్ల సర్వీసు దాటిన గిరిజన సిఆర్‌టిలను రెగ్యులర్ చేయాలని, జిఒ నెంబర్ 3ని పునరుద్ధరించాలని, పిఇటి, పండిట్ పోస్టులను అపరేట్ చేయాలని, బోధనేతర సిబ్బందిని నియమించాలని తీర్మానించారు. గిరిజన సంక్షేమ ఉపాధ్యాయులకు ఎంఇఒ, డిప్యూటీ డిఇఒ, డైట్ లెక్చరర్లగా ఉద్యోగోన్నతులు కల్పించాలని, భాషా వలంటీర్లను నియమించాలని, ఉపాధ్యాయుల రాత్రి బస ఉత్తర్వులను రద్దు చేయాలని సదస్సు తీర్మానించింది.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

ఐదుగురు విద్యార్థుల ఆత్మహత్యాయత్నం..

- వరంగల్ గురుకుల పాఠశాలలో కలకలం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలోని వరంగల్ నగరంలో ఆదివారం కలకలం రేగింది. స్థానిక జ్యోతిరావుపూలే గురుకుల పాఠశాలలోని విద్యార్థినులు ఐదుగురు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. పుట్టిన రోజు వేడుకల్లో బయటి వ్యక్తులు గురుకులంలోకి రావడంతో సిబ్బంది వారిన మందలించారు. దీంతో మనస్తాపం చెందిన ఐదుగురు విద్యార్థులు ఆత్మహత్యాయత్నం చేశారు. అప్రమత్తమైన సిబ్బంది వెంటనే సదరు విద్యార్థులను వరంగల్ ఎంజిఎం ఆస్పత్రికి తరలించి చికిత్స అందించడంతో ప్రస్తుతం ప్రాణాపాయం తప్పింది. విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు, అధ్యాపకులు తెలిపిన వివరాల ప్రకారం.. హన్మకొండ జిల్లా ఆరేపల్లెలో పూర్వ ఓరుగల్లు విద్యానికేతన్ భవనంలో ఉన్న ములుగు జిల్లా జ్యోతిరావు పూలే బాలికల గురుకుల పాఠశాల నిర్వహిస్తున్నారు. అక్కడ పదవ తరగతి చదువుతున్న విద్యార్థుల్లో ఒక విద్యార్థిది ఆదివారం పుట్టినరోజు కావడంతో ఆ వేడుకలను శనివారం రాత్రి 11:30 ప్రాంతంలో సిబ్బందికి తెలియకుండా గురుకులం టెర్రస్ పైన జరుపుకోవాలని ప్రయత్నించారు. గమనించిన సెక్యూరిటీ హాస్టల్ వార్డెన్ పైకి వెళ్లి చూడగా అప్పటికే పుట్టినరోజు జరుపుకునే అమ్మాయి అన్నయ్యతో పాటు అతని ఇద్దరు ఫ్రెండ్స్ ఉండటం గమనించిన వారిని గట్టిగా మందలించి బయటికి పంపించారు. ఈ విషయాన్ని ఆదివారం ఉదయం విద్యార్థినుల తల్లిదండ్రులకు ఫోన్ ద్వారా తెలిపి హాస్టల్‌కు రావాలని తెలిపారు. తల్లిదండ్రులు వస్తున్నారనే భయంతో ఐదుగురు విద్యార్థులు ఆదివారం ఉదయం తొమ్మిది గంటల ప్రాంతంలో బాత్‌రూమ్‌లు క్లీన్ చేసే ఫినాయిల్, అందుబాటులో ఉన్న సానిటైజర్లు తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించారు. గమనించిన సిబ్బంది వారిని ఎంజీఎంకు తరలించి చికిత్స అందిస్తున్నారు. స్ఫూర్తి, జోత్స్న, రుత్విక, ఉమాదేవి, చారువికల ఆరోగ్య పరిస్థితి 24 గంటలు గడిస్తే గాని చెప్పలేమని వైద్యులు సూచించారు.

ఉక్రెయిన్‌లో రిషి సునాక్ పర్యటన

కీవ్: బ్రిటన్ ప్రధానమంత్రి రిషి సునాక్ ఆదివారం నాడు ఉక్రెయిన్‌లో పర్యటించారు. రష్యా సైనిక ఆపరేషన్ సందర్భంగా ధ్వంసమైన ప్రాంతాలను ఉక్రెయిన్ అధ్యక్షులు జెలెన్ స్కీతో కలిసి సందర్శించారు. 'స్వేచ్ఛ కోసం పోరాటం అంటే ఏంటో బ్రిటన్‌కు బాగా తెలుసు. యుద్ధ సంక్షోభం నేపథ్యంలో ఎల్లప్పుడూ తోడుగా ఉంటాం' అని ఆయన జెలెన్ స్కీని ఉద్దేశించి పేర్కొన్నారు. రిషి పర్యటనకు సంబంధించిన వివరాలను జెలెన్ స్కీ ఫేస్‌బుక్ ద్వారా వెల్లడించారు. 'రష్యాతో యుద్ధం ప్రారంభమైన తొలినాళ్లలో ఉక్రెయిన్, బ్రిటన్ మధ్య సంబంధాలు దఢంగా ఉండేవి' అని ఆయన తెలిపారు. ఆదివారం సమావేశంలో ఇరుదేశాలకు సంబంధించిన కీలక అంశాలను చర్చించామని చెప్పారు. ఇటీవల ఇండోనేషియాలో జరిగిన జి20 సదస్సులోనూ ఉక్రెయిన్‌కు బ్రిటన్ మద్దతు తెలిపింది.

'పే అండ్ ప్లే' విధానాన్ని ఉపసంహరించాలి

- డివైఎఫ్ఐ డిమాండ్
- నేడు శాప్ ఎదుట నిరసన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) పరిధిలోని మైదానాలను ప్రయివేటుకు అప్పగించి, క్రీడాకారుల నుంచి ఫీజులు వసూలు చేసేలా తీసుకొచ్చిన 'పే అండ్ ప్లే' విధానాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) డిమాండ్ చేసింది. ఈ విధానాన్ని వ్యతిరేకిస్తూ శాప్ కార్యాలయం ఎదుట సోమవారం నాడు నిరసన ప్రదర్శన చేపట్టనున్నట్లు డివైఎఫ్ఐ రాష్ట్ర ప్రధానకార్యదర్శి జి రామన్న తెలిపారు.

విజయవాడలోని బాలోత్సవ్ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ 'పే అండ్ ప్లే' విధానం వల్ల పేద విద్యార్థులు క్రీడలకు దూరమౌతారని ఆందోళన వ్యక్తం చేశారు. 'జగనన్న స్పోర్ట్స్ క్లబ్'ల పేరిట శాప్ పరిధిలోని స్టేడియాలను ప్రయివేటుకు కట్టబెట్టడం సరైంది కాదన్నారు. ఈ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ ఇప్పటికే పలు రూపాల్లో ప్రభుత్వానికి విన్నవించినా పట్టించుకోవడం లేదని విమర్శించారు. సోమవారం జరిగే నిరసన కార్యక్రమంలో క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో రామన్నతో పాటు డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్ నాగేశ్వరరావు, రాష్ట్ర నాయకులు పి కృష్ణ, శివలు పాల్గొన్నారు.

వైభవంగా హీరో నాగశౌర్య పెళ్లి

బెంగళూరు : టాలివుడ్ యంగ్ హీరో నాగశౌర్య పెళ్లి ఆదివారం ఉదయం 11 గంటల 25 నిమిషాలకు బెంగళూరులోని ఓ ఫైవ్ స్టార్ హెటల్‌లో ఘనంగా జరిగింది. బంధువులు, అత్యంత సన్నిహితుల మధ్య బెంగళూరుకు చెందిన ఇంటీరియర్ డిజైనర్ అనూష శెట్టితో నాగశౌర్య వివాహ వేడుక వైభవంగా జరిగింది. ఈ పెళ్లి వేడుకకు సంబంధించిన ఓ వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. దీనిపై పలువురు స్పందిస్తూ నూతన జంటకు అభినందనలు చెబుతున్నారు. పెళ్లి ఫోటోలను చూసి నాగశౌర్య- అనూష జోడీ చాలా బాగుందని కామెంట్స్ పెడుతున్నారు. పెళ్లి వేడుకలో భాగంగా నిన్న వీరి హల్దీ సెలబ్రేషన్ కలర్ ఫుల్ గా జరిగింది. అనంతరం కాక్ టెయిల్ పార్టీ జరిగింది.

టాలీవుడ్‌కు చెందిన పలువురు ప్రముఖులు నాగశౌర్య వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. పలువురు సెలబ్రిటీలు సహా అభిమానుల నుంచి కొత్తజంటకు శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. అనూష శెట్టి ఇంటీరియర్ డిజైనర్‌గా పలు అవార్డులను అందుకున్నారు. కొన్నాళ్లుగా ఆమెకు నాగశౌర్యతో పరిచయం ఉంది. ఆ పరిచయం ప్రేమగా మారడంతో పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకున్నారు.

రైతుల కుటుంబాల్లో ఆర్థిక సంక్షోభం

- వ్యవసాయ అనుబంధ రంగాలపైనా తీవ్ర ప్రభావం
- బిజెపి ఆర్థిక, మతతత్వ విధానాలపై పోరుబాట
- విద్యుత్తు సంస్కరణ బిల్లు ఉపసంహరణకు ఉద్యమం : హన్నన్ మొల్లా
- ముగిసిన ఎఐకెఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశాలు

ఎఐకెఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశాలకు హాజరైన నాయకులు

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తోన్న రైతు వ్యతిరేక విధానాల వల్ల వ్యవసాయ రంగం సంక్షోభంలో చిక్కుకుందని ఎఐకెఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి హన్నన్ మొల్లా తెలిపారు. దీంతో, దేశ వ్యాప్తంగా కోట్లాది రైతుల కుటుంబాలు అప్పుల ఊబిలో కూరుకుపోయాయన్నారు. గుంటూరులో రెండు రోజులపాటు జరిగిన ఎఐకెఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశాలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా గుంటూరులోని పి.ఎల్.రావు భవన్‌లో నిర్వహించిన మీడియా ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతాంగ సమస్యలతోపాటు బిజెపి ప్రభుత్వం అవలంభిస్తోన్న మతతత్వ విధానాలపై కూడా పోరాడాలని నిర్ణయించినట్లు తెలిపారు. గత ఎనిమిదేళ్ల కాలంలో లక్షమందికిపైగా రైతులు ఆత్మహత్యకు పాల్పడ్డారని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయ అనుబంధ రంగాలపై ఆధారపడిన వివిధ తరగతుల ప్రజల జీవన స్థితిగతులు కూడా దెబ్బతిన్నాయని తెలిపారు. ప్రధానంగా రోజువారి వేతనం తీసుకునే కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కొత్తగా తీసుకొచ్చిన విద్యుత్తు రంగ సంస్కరణ చట్టం వల్ల భవిష్యత్తులో విద్యుత్తు ఛార్జీల భారం పెరుగుతుందని, తక్షణం విద్యుత్తు సంస్కరణ బిల్లును ఉపసంహరించుకునేలా రెండో దశ పోరాటాన్ని నిర్వహించాలని నిర్ణయించామని తెలిపారు. రైతులకు వ్యతిరేకంగా రూపొందించిన వ్యవసాయ నల్ల చట్టాలను వెనక్కి తీసుకున్న సందర్భంగా గతేడాది నవంబరు 19న కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసే వరకూ పోరాటం కొనసాగించాలని తీర్మానించినట్టు చెప్పారు. ఇందులో భాగంగా ఈ నెల 26న చలో రాజ్‌భవన్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని తెలిపారు. పంటల ఉత్పత్తి వ్యయానికి ఒకటిన్నర రెట్లు అధికంగా మద్దతు ధర కల్పించాలని స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేస్తామని కేంద్రం హామీ ఇచ్చిన హామీ అమలుకు నోచుకోలేదన్నారు. విద్యుత్తు సంస్కరణ బిల్లును ఉపసంహరించుకోవాలని, రైతులపై నమోదు చేసిన కేసులు ఎత్తివేయాలని, రైతాంగ ఉద్యమంలో చనిపోయిన 715 మంది కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించాలని, లఖింపూర్ ఘటనలో కీలకమైన కేంద్ర మంత్రి అజయ్ మిశ్రాను మంత్రి వర్గం నుంచి తొలగించాలని సమావేశం డిమాండ్ చేశారు. ప్రధాన మంత్రి బీమా పథకాలను పూర్తిగా పునర్‌వ్యవస్థీకరణ చేయాలని కోరారు. రైతాంగ సమస్యలతోపాటు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా సిఐటియు, ఎఐకెఎస్, ఎఐఎడబ్ల్యుయు తదితర సంఘాలతో కలిసి దేశ వ్యాప్తంగా ఆందోళనకు రైతాంగాన్ని సన్నద్ధం చేయాలని నిర్ణయించామన్నారు. కేంద్ర ప్రభుత్వం గతేడాది నవంబర్ 19న మూడు వ్యవసాయ నల్ల చట్టాలను ఉపసంహరించుకున్న తరుణంలో ఇచ్చిన హామీల అమలుకు దేశ వ్యాప్త ఉద్యమానికి సిద్ధమవుతున్నట్లు చెప్పారు. ఇందుకోసం దేశవ్యాప్తంగా 450 జిల్లాల్లో 35 వేల గ్రామాలు, ఆరు వేల ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. దేశవ్యాప్తంగా కార్మికులను, కర్షకులను, వ్యవసాయ కార్మికులను కలుపుకొని ఏప్రిల్ ఐదున ఐదు లక్షల మందితో చలో పార్లమెంటు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. మలి విడత పోరాటానికి దేశవ్యాప్తంగా రైతాంగాన్ని సన్నద్ధం చేసేందుకు వచ్చే నెల 13, 14, 15, 16 తేదీల్లో ఎఐకెఎస్ జాతీయ మహాసభను కేరళలోని త్రిచూరులో నిర్వహిస్తున్నట్టు హన్నన్ మొల్లా తెలిపారు. ఎఐకెఎస్ జాతీయ అధ్యక్షులు అశోక్ దావలే మాట్లాడుతూ కనీస మద్దతు ధరకు చట్టం చేయాలని, రైతుల, వ్యవసాయ కార్మికుల రుణాలు రద్దు చేయాలని, పంటల బీమా పథకాన్ని పునర్వ్యవస్థీకరించాలని కోరారు. 60 ఏళ్ల వయస్సు దాటిన రైతులకు నెలకు రూ.5 వేల చొప్పున పెన్షన్ ఇవ్వాలని, విద్యుత్తు సంస్కరణ బిల్లును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బిజెపి ప్రభుత్వం అనుసరిస్తోన్న మతతత్వ విధానాలకు వ్యతిరేకంగా విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. జాతీయ కౌన్సిల్ సమావేశంలో ఎఐకెఎస్ అధ్యక్షులు అశోక్ ధావలే, సహాయ కార్యదర్శి విజ్జుకృష్ణన్, ఉపాధ్యక్షులు సారంపల్లి మల్లారెడ్డి, కోశాధికారి కృష్ణప్రసాద్, రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షులు వి.కృష్ణయ్య, కార్యదర్శి ప్రభాకరరెడ్డి పాల్గొన్నారు.

సాకర్ సంబరం..
సంగీత ప్రవాహం

సాకర్ ప్రారంభోత్సవం వేడుకల్లో ఖతర్ గాయకుడు ఫహద్ అల్ కుబైసితో కలిసి పాటలు పాడుతున్న బిటిఎస్ జంగ్ కుక్

పశ్చిమగోదావరి జిల్లాలో నేడు సిఎం పర్యటన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సోమవారం నాడు పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురంలో పర్యటించనున్నారు. పలు అభివృద్ధి ప్రాజెక్టులకు సంబంధించిన ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి అందిన సమాచారం ప్రకారం.. తాడేపల్లి నివాసం నుంచి ఉదయం 10 గంటలకు బయలుదేరి 10.50 గంటలకు నరసాపురం చేరుకుంటారు. 11.15 నుంచి 12.50 గంటల వరకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల అనంతరం బహిరంగసభలో ప్రసంగిస్తారు. అనంతరం మధ్యాహ్నం 1.15 గంటలకు నరసాపురం నుంచి బయలుదేరి 2 గంటలకు తాడేపల్లికి చేరుకుంటారు.

జగనన్న ఇళ్లల్లో ఇంధన సామర్థ్య పరికరాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకం కింద నిర్మిస్తున్న జగనన్న కాలనీ లబ్ధిదారులకు ఇంధన సామర్థ్య పరికరాలు అందించాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది. ఈ పరికరాలను సరఫరా చేసేందుకు రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ, సిడ్కోతో ఇఇఎస్ఎల్ త్రైపాక్షిక ఒప్పందం కుదుర్చుకోనుంది. దీనిపై రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్‌తో ఇఇఎస్ఎల్ సిఇఒ విశాల్ కపూర్ ఆదివారం నిర్వహించారు.ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేస్తున్న ఇంధన సామర్థ్య ప్రాజెక్టులకు సహకరించేందుకు తాము ఎప్పుడూ సిద్ధంగా ఉంటామని విశాల్ కపూర్ చెప్పారు. ఇంధన సామర్థ్య రంగ అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్న అతికొద్ది రాష్ట్రాల్లో ఎపి ఒకటని ప్రశంసించారు. సాధారణ లైట్లు, ఫ్యాన్ల స్థానంలో ఇంధన సామర్థ్యంతో కూడిన లైట్లు, ఫ్యాను వాడడం వల్ల పెద్దఎత్తున విద్యుత్ ఆదా చేయవచ్చని చెప్పారు. ఉపకరణాలు సరఫరాపై గృహ నిర్మాణ శాఖతో మరోసారి సంప్రదించి తుది ప్రణాళికను ఖరారు చేస్తామన్నారు. అజయ్‌జైన్ మాట్లాడుతూ నవరత్నాలు పేదలందరికీ ఇల్లు పథకం కింద 21.25లక్షల ఇల్లు మంజూరు అయ్యాయని తెలిపారు. ఇప్పటివరకు 17.24లక్షల ఇల్లు గ్రౌండ్ అయ్యాయని వివరించారు. మొదటి దశ కింద నిర్మిస్తున్న 15.6లక్షల ఇళ్లకు ఒక్కో లబ్ధిదారునికి 4 ఎల్ఇడి బల్బులు, ఇఎల్ఇడి ట్యూబ్ లైట్లు, 2 ఇంధన సామర్థ్యంతో కూడిన ఫ్యాన్లు అందజేయాలని భావిస్తున్నట్లు వెల్లడించారు.మార్కెట్ ధర కంటే తక్కువ ధరకే వీటికి లబ్ధిదారులకు అందజేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. లబ్ధిదారులకు ఈ ఉపకరణాలు ఒక ఎంపిక మాత్రమేనని, తప్పనిసరి కాదని వెల్లడించారు. వీటి వినియోగం వల్ల ఒక్కో గృహంలో ఏడాదికి 734 యూనిట్ల విద్యుత్ ఆదా అవుతుందని అంచనా వేశారు. 15.6లక్షల ఇళ్లకు గాను ఏడాదికి రూ.352కోట్లు విలువైన విద్యుత్ ఆదా అయ్యే అవకాశం ఉందని వివరించారు.

జగన్ పాలనలో ఫెయిల్

టిడిపి నేత యనమల రామకృష్ణుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సిఎం జగన్ రాష్ట్రాన్ని దోచుకోవడంలో సక్సెస్ అని, పాలనలో మాత్రం విఫలమయ్యారని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు విమర్శించారు. చంద్రబాబు సభలకు వస్తున్న జన సునామీని చూసి జగన్, వైసిపి నేతలకు భయం పట్టుకుందని ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. రాజకీయ నేతలపై ఉన్న క్రిమినల్ కేసులు విచారణ త్వరితగతిన విచారణ చేయాలన్న న్యాయస్థానాల వ్యాఖ్యలతో వైసిపి నేతల ఆందోళన తీవ్ర స్థాయికి చేరిందని విమర్శించారు. అందుకే ఇష్టానుసారం నోరు పారేసుకుంటున్నారన్నారు. ప్రజల తలరాతలు మారుస్తానని ప్రజలకు ఎన్నో ఆశలు కల్పించి జగన్ అధికారంలోకి వచ్చారని, మూడేళ్లు గడిచే సరికి ప్రజల భ్రమలు తొలగిపోయాయని పేర్కొన్నారు. పరిపాలన చేతకావడం లేదని నిరూపితమయిందని విమర్శించారు. అరకొర సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ప్రజలపై భారాల మోత మోగిస్తున్నారని విమర్శించారు. విద్యుత్, ఆర్టీసి చార్జీలు, పట్టణాల్లో ఆస్తి పన్నుపెంపు, చెత్తపన్ను, నీటి పన్ను, మున్సిపల్ సేవల వినియోగ చార్జీలు పెంచారని పేర్కొన్నారు. వ్యవసాయ పంపుసెట్లకు విద్యుత్ మీటర్ల బిగింపు, పాఠశాలల విలీనం, లేబర్ కోడ్‌ల వంటి వినాశకర విధానాలను అత్యుత్సాహంతో రాష్ట్రంలో అమలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగులకు ఇచ్చిన హామీలు అమలు కాలేదని, వేతన సవరణ, సిపిఎస్ రద్దు హామీలను గాలికొదిలేశారని విమర్శించారు. ప్రత్యేక హోదాతో పాటు విభజన హామీల అమలులో జగన్ పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు.

అప్పుల వేటలో రాష్ట్రమే ముందు

- టిడిపి నేత పట్టాభిరామ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అప్పుల వేటలో ఆంధ్రప్రదేశ్ మొదటిస్థానంలో ఉందని టిడిపి అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ తెలిపారు. ఈ విషయాన్ని రిజర్వుబ్యాంకే వెల్లడించిందన్నారు. ఈశాన్య, కరువు రాష్ట్రాల సరసన వైఎస్ జగన్ రాష్ట్రాన్ని నిలిపారని విమర్శించారు. టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆదివారం ఆయన మాట్లాడారు. అభివృద్ధిలో వెనుకబడిన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కూడా ఈ ఏడాది ఆర్‌బిఐ నుంచి ఒక్క రూపాయి అప్పు తీసుకోలేదని, ఏపి మాత్రం అప్పులతోనే పాలన సాగిస్తోందని తప్పుబట్టారు. అప్పుల వేటలో దేశంలో మరేఇతర రాష్ట్రానికి లేనటువంటి తపన రాష్ట్రానికే ఉందని, అందుకనే ప్రజలు 'ఇదేం కర్మ రాష్ట్రానికి' అని గగ్గోలు పెడుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఆర్‌బిఐ ఇచ్చిన సమాచారానికి ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ ఏం సమాధానం చెబుతారని నిలదీశారు.

ప్రశ్నిస్తే దాడులకు పాల్పడతారా?: బిటి నాయుడు

రాష్ట్రంలో ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించేవారిపైనా, విమర్శించే వారిపైనా దాడులకు దిగడం సిగ్గుచేటు అనిటిడిపి ఎమ్మెల్సీ బిటి నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. శాంతియుత ప్రదర్శనలు, నిరసనలు, పరామర్శలు జరిపే ప్రాథమిక హక్కు కూడా ప్రతిపక్షానికి లేకుండా పోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. టిడిపి అధినేత చంద్రబాబు కర్నూలు జిల్లా పర్యటన విజయవంతం కావడంతో వైసిపి నేతలకు దిక్కుదోచని పరిస్థితి ఏర్పడిందని ఆయన తెలిపారు.

నేడు కలెక్టరేట్ల వద్ద తెలుగు యువత నిరసనలు

తెలుగు యువత ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా సోమవారం కలెక్టరేట్ల వద్ద నిరసనలు జరగనున్నాయి. ఎస్సి,ఎస్టి, బిసి, మైనార్టీ కార్పొరేషన్ల ద్వారా నిరుద్యోగులకు స్వయం ఉపాధి కల్పించాలని, బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ, ప్రతి జిల్లాలో పారిశ్రామిక కారిడార్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ కార్యాక్రమాన్ని చేపడుతున్నట్లు తెలుగు యువత అధ్యక్షులు శ్రీరాం చినబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో నిరుద్యోగ యువత, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు ప్రజా ఉద్యమం

మొదటి పేజి తరువాయి

డిమాండ్ చేశారు. ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలనే ప్రతిపాదన సరికాదన్నారు. నాడు స్టీల్‌ప్లాంట్ ఆవిర్భావం కోసం సాగిన ఉద్యమంలో 51 మంది కమ్యూనిస్టు పార్టీ ఎమ్మెల్యేలు, ఏడుగురు ఎంపిలు తమ పదవులకు రాజీనామా చేసి ఉద్యమంలో పాల్గొన్న విషయాన్ని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రజలు కమ్యూనిస్టులను నమ్మాలని, వారి వెంట నడవాలని పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం అన్ని పార్టీలూ ఒక్కటవ్వాలన్నారు. సిబిఐ మాజీ జాయింట్ డైరెక్టర్ వివి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ ఇప్పుడు దేశం గుండెచప్పుడుగా మారిందన్నారు. కేంద్రం చేపడుతున్న పలు ప్రాజెక్టులకు, గృహాలకు విశాఖ ఉక్కునే వినియోగిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. జెండాలు వేరైనా అందరి అజెండా పోరాటమే కావాలని ఆకాంక్షించారు. స్టీల్‌ప్లాంట్ గుర్తింపు సంఘం గౌరవాధ్యక్షులు డి ఆదినారాయణ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ కాకుండా తాము చేస్తున్న పోరాట వివరాలను తెలియజేశారు.

పంట పొల్లాల్లో సంచరిస్తున్న ఏనుగుల గుంపు

పంట పొలాలపై ఆగని గజ దాడులు

- ఏడు ఎకరాల్లో వరి, టమోటా పంట నష్టం

ప్రజాశక్తి- పలమనేరు:
చిత్తూరు జిల్లా పలమనేరు రూరల్ మండలంలోని పెంగరగుంట, వడ్డూరు, మొసలి మడుగు గ్రామాల్లో శనివారం రాత్రి ఏనుగుల గుంపు పంట పొలాలను తొక్కి నాశనం చేశాయి. కోత దశకు వచ్చిన సుమారు ఏడెకరాల వరి, టమోటా పంటలతోపాటు పశు గ్రాసంను ధ్వంసం చేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గత వారం రోజులుగా అటవీ ప్రాంతానికి సమీప గ్రామాల్లో సాయంత్రం ఏడు గంటల సమయంలో పంట పొలాల్లోకి ప్రవేశించి పంటలను తిని ధ్వంసం చేస్తున్నాయి. వీటిని తరిమేందుకు అటవీశాఖ అధికారులు ట్రాకర్స్ పెట్టినప్పటికీ ఏనుగులు వారిని ముప్పుతిప్పలు పెట్టి గ్రామాల్లోకి వచ్చేస్తున్నాయి. కష్టపడి పండించిన పంటలను ఏనుగుల బారి నుంచి ఎలా కాపాడుకోవాలో తెలీక రైతులు నానా అవస్థలు పడుతున్నారు. ఈ ఏనుగుల గుంపు ఇటీవల టేకుమంద, కీరమంద, మొగిలి, మొగిలేరుపల్లి, గాండ్లపల్లి గ్రామాల్లో తిరుగుతూ పంటను తొక్కినాశనం చేయడంతో అటవీశాఖ అధికారులు వాటిని దారి మళ్లించారు. అయితే గత రెండ్రోజులుగా గుంపులుగా సంచరిస్తూ మళ్లీ పొలాలపై పడ్డాయి. తాము అప్పులు చేసి కష్టపడి పండించిన పంటలను కోతదశలో ఏనుగులు నాశనం చేస్తున్నాయని స్థానిక రైతులు వాపోతున్నారు. అటవీశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు ఏనుగుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని వారు కోరుతున్నారు.

ద్వారకాతిరుమల ప్రజాశక్తి విలేకరి కృష్ణారావు మృతి

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల, ఏలూరు
ఏలూరు జిల్లాలో ప్రసిద్ధ క్షేత్రమైన ద్వారకాతిరుమలలో ప్రజాశక్తి విలేకరిగా పని చేస్తున్న కనకం కృష్ణారావు (60) తీవ్ర అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆరోగ్యం విషమించి మృతి చెందారు. ఆయన భౌతికకాయాన్ని ఆదివారం రాత్రి ద్వారకాతిరుమలకు తరలించారు. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ప్రజాశక్తి విలేకరిగా ఆయన సుమారు 15 ఏళ్లుగా పని చేస్తున్నారు. కృష్ణారావు అకాల మృతికి ప్రజాశక్తి ఎడిటర్ బి తులసీదాస్, సిజిఎం వై అచ్యుతరావు, రాజమండ్రి ఎడిషన్ మేనేజర్ డి శ్రీనివాస్, డెస్క్ఇన్‌ఛార్జి వివిఎస్‌వి ప్రసాద్, స్టాఫ్ రిపోర్టర్ పి గంగరాజు, ఎడివిటి జిల్లా ఇన్‌ఛార్జి పి నారాయణరాజు, సర్క్యులేషన్ ఇన్‌ఛార్జి వై సీతారాం సంతాపం తెలిపారు. కృష్ణారావు మృతి పట్ల సిపిఎం ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల కార్యదర్శులు ఎ రవి, బి బలరాం, తదితరులు తీవ్ర సంతాపం తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కృష్ణారావు అంత్యక్రియలు సోమవారం నిర్వహించనున్నట్లు ఆయన కుటుంబసభ్యులు చెప్పారు.

కృష్ణారావు

చాగంటికి గురజాడ పురస్కారం తగదు

- ప్రజానాట్యమండలి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
మనువాద సిద్ధాంతంతో ప్రజల్లో మూఢాచారాలను, చాందసవాద పోకడలను పెంచి పోషిస్తున్న చాగంటి కోటేశ్వరరావుకు గురజాడ స్మారక పురస్కారం ఇవ్వడం తగదని ప్రజానాట్యమండలి పేర్కొంది. గురజాడ సాంస్కృతిక సమాఖ్య తన వైఖరిని తక్షణం మార్చుకొని చాగంటికి ప్రకటించిన పురస్కారాన్ని వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు పి మంగరాజు, ఎస్ అనిల్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గురజాడ అప్పారావు భావాలు, ఆశయాలు, లక్ష్యాలకు పూర్తి భిన్నమైన వారికి పురస్కారాలు ఇవ్వడం సరికాదన్నారు.

రాజ్యాంగ హక్కులను
ఉల్లంఘిస్తే పోలీసులకైనా జైలు

- సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి గోపాలగౌడ

సెమినార్‌లో మాట్లాడుతున్న సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి గోపాల గౌడ

ప్రజాశక్తి- తిరుపతి టౌన్
రాజ్యాంగం ప్రజలకు ఇచ్చిన హక్కును ఉల్లంఘిస్తే పోలీసులైనా, ఉన్నతాధికారులైనా జైలుకెళ్లక తప్పదని సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి గోపాల గౌడ అన్నారు. తిరుపతిలోని ఓ ప్రయివేటు హోటల్లో సిఐటియు, ఎంబివికె ఆధ్వర్యాన నండూరి ప్రసాదరావు స్మారక సెమినార్ ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి అధ్యక్షతన 'ప్రజా ఉద్యమాలు... నిర్బంధం' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో గోపాలగౌడ మాట్లాడుతూ రాజ్యాంగం దేశప్రజలకు అనేక హక్కులు కల్పించిందని, అందులో భావప్రకటనా స్వేచ్ఛ, ప్రశ్నించే హక్కు, నిరసన తెలిపే హక్కులు కూడా ఉన్నాయని గుర్తు చేశారు. రాష్ట్రంలోని పోలీసులు అనుసరిస్తోన్న తీరు అమానవీయంగా ఉందన్నారు. తిరుపతిలోని సిఐటియు నాయకుల గృహాలను, కార్యాలయాన్ని దిగ్బంధించిన తీరును తప్పుపట్టారు. సిపిఎం మాజీ ఎంపి మధు, కర్నూలు మాజీ ఎమ్మెల్యే, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఎ గఫూర్ పట్ల పోలీసులు అనుసరించిన తీరు అమానుషంగా ఉందన్నారు. రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం పోలీసుల ద్వారా కార్మికులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీలు, ఆశాలు, మధ్యాహ్న భోజన కార్మికులు, టిటిడి అటవీ కార్మికులు మీద సాగిస్తున్న పైశాచిక దాడిని ఆయన తీవ్రంగా తప్పుపట్టారు. కార్మికశక్తి లేకుంటే దేశాభివృద్ధి లేదన్నారు. రాజ్యాంగం ఇచ్చిన హక్కులను అపహాస్యం చేయొద్దని, రాజ్యాంగ హక్కులను కాపాడే బాధ్యత శాసన వ్యవస్థకు ఉందని తెలిపారు. రాష్ట్రంలో జరుగుతున్న అన్యాయాలను ఎదుర్కొనేందుకు, తానే స్వయంగా పిటిషన్లు తయారు చేసేందుకు సన్నద్ధంగా ఉన్నానని, అవసరమైతే సుప్రీం కోర్టులో సీనియర్ లాయర్లను ఏర్పాటు చేస్తానని తెలిపారు. హైకోర్టులో అవసరమైన న్యాయసహాయాన్ని అందిస్తానని ప్రకటించారు. తొలుత సిఐటియు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను ఆయన తిలకించారు. సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ నర్సింగరావు మాట్లాడుతూ రాష్ట్రంలో కార్మికవర్గంపై సాగిస్తున్న ఉద్యమాలపట్ల జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తున్నదన్నారు. సమస్యలపై ప్రశ్నిస్తుంటే పరిష్కారానికి చొరవ చూపాల్సిన ప్రభుత్వం నోరెత్తకుండా లాఠీలను ఝుళిపించడం దారుణమన్నారు. రానున్న రోజుల్లో కార్మికవర్గమే కాకుండా రైతులు, వ్యవసాయ కూలీలను కలుపుకొని పెద్దఎత్తున పోరాటాలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో తిరుపతి బార్ అసోసియేషన్ అధ్యక్షులు టి.దినకర్, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు, ఐఎన్‌టియుసి, టిఎన్‌టియుసి, ఎఐసిసిటియు, ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నేతలు, న్యాయవాదులు పాల్గొన్నారు.

రాజకీయాల్లో రాణించడం చాలా కష్టం : చిరంజీవి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
ప్రసుత సమాజ పరిస్థితుల్లో రాజకీయాల్లో రాణించడం చాలా కష్టమని, సున్నితమనస్కులు రాజకీయాలకు సరిపోరని అగ్ర కథానాయకుడు, కేంద్ర మాజీ మంత్రి చిరంజీవి అన్నారు. హైదరాబాద్‌లోని వైఎంఎం కళాశాలలో ఆదివారం జరిగిన పూర్వ విద్యార్థుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాజకీయాల్లో మాటలు అనాలి, పడాలి.. చాలా మొరటుగా, కటువుగా ఉండాల్సి వస్తుందని చెప్పారు. ఒక దశలో నాకు ఈ రాజకీయాలు అవసరమా? అనిపించిందని పేర్కొన్నారు. ప్రస్తుత రాజకీయాలకు పవన్‌కల్యాణ్ తగినవాడని, అంటాడు అనిపించుకుంటాడని అన్నారు. ప్రజలందరి ఆశీస్సులతో ఏదో ఒకరోజు పవన్‌కల్యాణ్ అత్యుత్తమ స్థానంలో ఉంటాడని విశ్వాసం వ్యక్తంచేశారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం అనే ప్రక్రియ 200 ఏళ్ల క్రితం అమెరికాలో మొదలైనట్లు విన్నానని తెలిపారు. దీని ద్వారా పూర్వ విద్యార్థులంతా కలిసి గత స్మృతులను గుర్తు చేసుకోవడం, వారు సాధించిన విజయాలు గురించి చర్చించుకోవడం, ఆ దిశగా రాణించాలనుకొనే వారికి చేయూతనివ్వడమనేది మాటల్లో చెప్పలేని అనుభూతి అన్నారు. భవిష్యత్తులో మనం ఏం కావాలనుకుంటున్నామో దానికి బీజం పడేది కాలేజీ రోజుల్లోనే అని తెలిపారు. కాలేజీ సమయం నుంచే తనకు నటనపై ఇష్టం ఉండేదని, ఆ మక్కువ కొద్దీ ఓ నాటకం వేస్తే ఉత్తమ నటుడిగా పేరొచ్చిందని గుర్తుచేసుకున్నారు. ఎన్ని కష్టాలు ఎదురైనా వాటిని అధిగమించి సినిమా రంగంలో నటుడిగా రాణించాలనే బలమైన నమ్మకానికి ఆనాడే పునాది పడిందన్నారు. కేవలం పుస్తకాల నుంచే కాకుండా.. మన చుట్టూ ఉండే వ్యక్తులు, పరిస్థితుల నుంచీ నేర్చుకుంటూనే ఉండాలని సూచించారు.

సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులుగా పి ప్రభాకర్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో
సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులుగా పి ప్రభాకర్‌ను ఎన్నుకున్నట్టు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఉన్న పి ప్రభాకర్‌ను కొత్తగా కార్యదర్శివర్గంలోకి తీసుకోవాలని రాష్ట్ర కమిటీ నిర్ణయించిందని తెలిపారు. విద్యార్థి, యువజన రంగాల్లోనూ, సిపిఎం హైదరాబాద్ నగర కమిటీలోనూ ప్రభాకర్ పాలుపంచుకున్నారని పేర్కొన్నారు. 1985 నుంచి పార్టీ హోల్‌టైమర్‌గా సేవలందిస్తున్న ప్రభాకర్ పలు కీలక బాధ్యతలు నిర్వహించారు. చీమకుర్తి ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఎస్‌ఎఫ్‌ఐ కార్యదర్శిగా విద్యార్థి దశ నుంచే ఉద్యమ నాయకత్వం వహించారు. ప్రకాశం జిల్లా ఎస్‌ఎఫ్‌ఐ అధ్యక్షులుగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఎస్‌ఎఫ్‌ఐ, డివైఎఫ్‌ఐ అధ్యక్షులుగా పనిచేశారు. 2005 నుంచి 2016వరకు ప్రజాశక్తిలో వివిధ కీలక హోదాల్లో ప్రభాకర్ సేవలందించారు. ప్రస్తుతం ఆయన నవతెలంగాణ పత్రిక సిజిఎంగా, గచ్చిబౌలి సుందరయ్య విజ్ఞాన కేంద్రం కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

కేంద్రం హామీల అమలుకు పోరాటం

- దేశ వ్యాప్తంగా రెండో దశ ఉద్యమానికి సన్నద్ధం
- 'ప్రజాశక్తి'తో ఎఐకెఎస్ జాతీయ అధ్యక్షులు అశోక్ ధావలే

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి
రైతులకు వ్యతిరేకంగా రూపొందించిన వ్యవసాయ నల్ల చట్టాలను వెనక్కి తీసుకున్న సందర్భంగా గతేడాది నవంబరులో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఇంతవరకూ అమలుకు నోచుకోలేదని అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) జాతీయ అధ్యక్షులు అశోక్ ధావలే పేర్కొన్నారు. ఈ చట్టాలకు వ్యతిరేకంగా కిసాన్ సంయుక్త మోర్చా (ఎస్‌కెఎం) ఆధ్వర్యంలో 13 నెలలపాటు పోరాటం జరిగిందని, తరువాత కేంద్రం దిగి వచ్చి చట్టాలు రద్దు చేస్తున్నట్టు ప్రకటించిందని తెలిపారు. గుంటూరులో శని, ఆదివారాల్లో జరిగిన ఎఐకెఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశాలకు హాజరైన అశోక్ ధావలే 'ప్రజాశక్తి ప్రతినిధి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాలు తెలియజేశారు.

మూడు వ్యవసాయ నల్ల చట్టాలను ఉపసంహరించుకున్న సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఏమిటి?

పంటల ఉత్పత్తి వ్యయానికి ఒకటిన్నర రెట్లు అధికంగా మద్దతు ధర ఇవ్వాలన్న స్వామినాథన్ కమిషన్ సిఫార్సును అమలుకు కేంద్రప్రభుత్వం హామీ ఇచ్చింది. విద్యుత్తు సంస్కరణ బిల్లును ఉపసంహరించుకోవాలని, రైతులపై నమోదు చేసిన కేసులను ఎత్తివేయాలని, రైతాంగ ఉద్యమంలో చనిపోయిన వారి కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించాలని, లఖింపూర్ ఘటనలో కీలకమైన కేంద్ర మంత్రి అజయ్ మిశ్రాను మంత్రివర్గం నుంచి తొలగించాలని డిమాండ్ చేశాం. వీటి అమలుకు చర్యలు తీసుకుంటామని చెప్పిన కేంద్రం... ఇంతవరకూ ఇందుకు సంబంధించి ఎటువంటి చర్యలూ తీసుకోలేదు. వీటితోపాటు కొత్తగా మరో మూడు డిమాండ్లతో రెండో దశ పోరాటానికి సన్నద్ధం అవుతున్నాం.

రెండో దశ ఉద్యమంలో ప్రధాన డిమాండ్లు ఏమిటి?

ప్రస్తుతం వ్యవసాయం తీవ్ర సంక్షోభంలో పడింది. కేంద్రం ఇచ్చిన హామీల అమలుకు, రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యల పరిష్కారానికి మళ్లీ ఉద్యమం చేయాలని కార్యాచరణ రూపొందించాం. రైతులకు సంపూర్ణ రుణ మాఫీ చేయాలి. ఆత్మహత్య చేసుకున్న రైతుల కుటుంబాలకు పరిహారం ఇవ్వాలి. 60 ఏళ్లు దాటిన రైతులకు పింఛను సదుపాయం కల్పించాలి. బీమా పథకాలను పునర్‌వ్యవస్థీకరించాలి. కేంద్రం ఇచ్చిన హామీలతో పాటు ఈ డిమాండ్ల సాధనకు మరో విడత పోరాటానికి సన్నద్ధం అవుతున్నాం. బ్యాంకుల నుంచి వ్యవసాయానికి, వ్యవసాయ అనుబంధ రంగాలకు తీసుకున్న రుణాలన్నింటినీ మాఫీ చేయాలి. గత ఎనిమిదేళ్లలో అంబానీ, ఆదాని తదితర కార్పొరేట్ సంస్థలకు రూ.10.72 లక్షల కోట్ల రుణమాఫీ చేశారు. కానీ, రైతులకు మాత్రం ఒక్క రూపాయి మాఫీ చేయలేదు. గత ఎనిమిదేళ్లలో లక్ష మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. వారి కుటుంబాలకు ఆర్థిక సాయం అందించాలి. ప్రధాన మంత్రి బీమా పథకాలను పూర్తిగా పునర్ వ్యవస్థీకరించాలి. ఈ బీమా పథకాల వల్ల రైతుల కన్నా బీమా కంపెనీలకు ఎక్కువగా మేలు కలుగుతోంది. గుజరాత్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణతోపాటు ఎనిమిది రాష్ట్ర ప్రభుత్వాలు ఈ బీమా పథకాల నుంచి బయటకు వచ్చాయి. ప్రకృతి వైపరీత్యాల వల్ల దెబ్బతింటున్న రైతులకు గ్రామం యూనిట్‌గా బీమా పరిహారం అందించాలి. బీమా అమలుకు ఉన్న ఆంక్షలను సడలించాలి. 60 ఏళ్ల వయస్సు దాటిన సన్న, చిన్నకారు రైతులకు నెలకు రూ.5 వేలు పింఛను ఇవ్వాలి.

మరో ఉద్యమానికి కార్యాచరణ ఏమిటి?

ఢిల్లీ సరిహద్దులో రైతాంగ పోరాటాలు ప్రారంభమై ఈ ఏడాది నవంబరు 26వ తేదీకి రెండేళ్లు అవుతున్నాయి. అదే రోజున రాజ్యాంగ ఆమోద దినోత్సవం కూడా జరుగుతోంది. ఈ నేపథ్యంలో రైతు డిమాండ్ల సాధనకు ఈ నెల 26న అన్ని రాష్ట్రాల్లో రాజ్‌భవన్‌ల వద్ద వేలాదిమంది రైతులతో ర్యాలీలు జరగనున్నాయి. రాష్ట్రాల గవర్నర్ల ద్వారా రాష్ట్రపతికి వినతిపత్రాలు సమర్పిస్తాం. డిసెంబరు ఒకటో తేదీ నుంచి 11వ తేదీ వరకూ దేశ వ్యాప్తంగా పార్లమెంటు సభ్యులు, శాసన సభ్యులకు వినతిపత్రాలు అందిస్తాం. డిసెంబరు ఎనిమిదిన హర్యానాలోని కర్నాల్‌లో భవిష్యత్తు కార్యాచరణ కోసం రైతు సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసి చర్చిస్తాం. డిసెంబరు 13 నుంచి 16 వరకు త్రిచూర్‌లో జరగబోయే ఎఐకెఎస్ ఆలిండియా మహాసభలో తుది కార్యాచరణ ప్రకటిస్తాం. రైతాంగ సమస్యలతోపాటు కార్మిక చట్టాల స్థానంలో నూతనంగా తెచ్చిన లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా సిఐటియు, ఎఐకెఎస్, ఎఐఎడబ్ల్యుయు తదితర సంఘాలతో కలిసి దేశ వ్యాప్తంగా ఆందోళన చేపడుతున్నాం. వీటిపై ఈ ఏడాది సెప్టెంబరు ఐదున ఢిల్లీల రెడ్‌ఫ్లాగ్ డే నిర్వహించాం. వచ్చే ఏడాది ఏప్రిల్ ఐదున ఐదు లక్షల మందితో ఢిల్లీలో ర్యాలీ నిర్వహిస్తాం. రైతుల డిమాండ్లతోపాటు ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ, లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకిస్తూ పోరాటం చేయనున్నాం. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని విస్తరించి పట్టణ ప్రాంతాల్లోని వ్యవసాయ కార్మికులకు కూడా ఉపాధి కల్పించాలనే డిమాండ్‌తో ఆందోళన చేయనున్నాం. ఢిల్లీలో జరిగే ర్యాలీకి సంబంధించి జనవరి 5 నుంచి మార్చి 31 వరకూ గ్రామ స్థాయిలో విస్తృత ప్రచార కార్యక్రమాలు, పాదయాత్రలు నిర్వహించనున్నాం. ఐదో తేదీన పార్లమెంటుకు ఐదు లక్షల మందితో ర్యాలీ నిర్వహిస్తాం.

రైతాంగ పోరాటం తర్వాత కేంద్ర ప్రభుత్వ తీరు ఎలా ఉంది?

కేంద్రం తీరు ఏమీ మారలేదు. రాజ్యాంగంపై దాడి జరుగుతోంది. ప్రజాస్వామ్యాన్ని, సెక్యులరిజాన్ని దెబ్బతీసేందుకు తీవ్ర ప్రయత్నాలు జరుగుతున్నాయి.

మహాసభ వేదిక వద్ద తోరణాలు కడుతున్న ప్రజా సంఘాల నాయకులు

సర్వం సిద్ధం

- నేటి నుంచి కౌలు రైతు సంఘం రాష్ట్ర మహాసభ
- చిలకలూరిపేటలోని నన్నపనేని వెంకటరత్నం కన్వెన్షన్‌లో ఏర్పాట్లు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి
కౌలు రైతు సంఘం రాష్ట్ర మహాసభ సోమ, మంగళవారాల్లో పల్నాడు జిల్లా చిలకలూరిపేటలోని నన్నపనేని వెంకటరత్నం కన్వెన్షన్‌లో జరగనుంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను నిర్వాహకులు పూర్తి చేశారు. ఉదయం పది గంటలకు ప్రారంభ సభ జరగనుంది. సాయంత్రం నాలుగు గంటలకు నన్నపనేని వెంకటరత్నం కన్వెన్షన్ నుంచి కళామందిర్ సెంటర్ వరకు కౌలు రైతులు ప్రదర్శన నిర్వహించనున్నారు. కళామందిర్ సెంటర్‌లో బహిరంగ సభ జరగనుంది. ఈ సభకు కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ అధ్యక్షత వహించనున్నారు. ప్రధాన ఉపన్యాసకులుగా ఎఐకెఎస్ జాతీయ సహాయ కార్యదర్శి విజ్జుకృష్ణన్, ఉపన్యాసకులుగా ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, కౌలు రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు తదితరులు ప్రసంగించనున్నారు. రెండు రోజులపాటు కొనసాగనున్న మహాసభలో కౌలు రైతుల సమస్యలపై చర్చించనున్నారు. ప్రధానంగా కౌలు రైతులకు ఇవ్వాల్సిన సాగు ధ్రువీకరణ పత్రాల జారీలో ఎదురవుతున్న ఇబ్బందులు, రుణ బకాయిల రద్దు, భూ యజమానితో సంబంధం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డుల జారీ, భూ యజమానితో సంబంధం లేకుండా ఈ క్రాపింగ్ చేయడం, కేరళ తరహాలో పంటలకు మద్దతు ధరతోపాటు బోనస్ అందించడం వంటి డిమాండ్లపై సమావేశంలో చర్చించనున్నారు. దేవాలయ భూములను సాగు చేస్తున్న కౌలు రైతులకు అన్ని రకాల ప్రభుత్వ సదుపాయాలు కల్పించడం, అగ్ర కులాల వారికి కూడా రైతు భరోసా వర్తింపజేయడం, ముందస్తు క్యాష్ కౌలు విధానం రద్దు చేయడం, కౌలు, ఎరువులు, పురుగుమందుల ధరలు తగ్గించడం, ఆత్మహత్యలకు పాల్పడిన ప్రతి రైతు కుటుంబానికి 13 రకాల ధృవీకరణ పత్రాలతో సంబంధం లేకుండా రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, కౌలు రైతులందరికీ స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం రుణాలు ఇవ్వాలన్న డిమాండ్లపై చర్చించనున్నారు. 2011లో ఉన్న కౌల్దార్ల చట్టం స్థానంలో 2019 చట్టం తేవడం వల్ల రైతులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, 2019 చట్టాన్ని వెంటనే సవరణ చేయాలన్న అంశంపై చర్చించనున్నట్టు కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ తెలిపారు. కౌలు రైతులకు అన్ని సదుపాయాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

నృత్య ప్రదర్శనలో చిన్నారులు

ప్రజల కష్టాలను కళ్లకు కట్టిన కళాకారులు

- కౌలురైతు సంఘం రాష్ట్ర మహాసభ నేపథ్యంలో పిఎన్ఎం సాంస్కృతిక ప్రదర్శనలు

ప్రజాశక్తి - చిలకలూరిపేట, పల్నాడు జిల్లా
కౌలురైతు సంఘం రాష్ట్ర మూడవ మహాసభ నేపథ్యంలో పల్నాడు జిల్లా చిలకలూరిపేట పట్టణంలో ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో ఆదివారం సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. కళామందిర్ సెంటర్‌లోని తేళ్ల ఆదినారాయణ సభావేదికపై నిర్వహించిన ప్రదర్శనల్లో దేశం మీద సామ్రాజ్య వాదుల పెత్తనం, ప్రజలపై పాలకుల సవారీ, పొలాల్లో రైతుల కష్టాలు, అప్పుల బాధలతో ఆత్మహత్యలు, కూలీలు, కార్మికుల సమస్యలు, ధరల భారం, జీవనం దుర్భరం వంటి అన్ని అంశాలకూ కారణాలను తెలుపుతూ విముక్తి మార్గం వైపు నడిపించే సందేశాలతో కళారూపాలు సాగాయి. ఇందులో భాగంగా ప్రజానాట్య మండలి కళాకారుల గీతాలు, నృత్యాలు, నాటకాలు ఆలరించాయి. సత్తెనపల్లి మండలం ఫణిదం, రెంటపాళ్ల గ్రామాలకు చెందిన చిన్నారుల కోలాట ప్రదర్శన, జాతీయ జెండాలతో దేశభక్తి ప్రబోధిత నృత్యాలు ఆకట్టుకున్నాయి. యడ్లపాడుకు చెందిన కళాకారులు 'బ్రతుకుతారా' నాటక ప్రదర్శన జనం కష్టాలను కళ్లకు కట్టింది. కళా ప్రదర్శనలను చూసేందుకు ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా ప్రజానాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి అనిల్ మాట్లాడుతూ కళ కళ కోసం కాదని.. కళ ప్రజల కోసమనే ఆశయంతో ప్రజానాట్య మండలి ఏర్పాటైందని, ఆదే స్ఫూర్తితో పని చేస్తోందని అన్నారు. సామాన్యులు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటికి కారణాలపై ప్రజల్ని చైతన్యం వంతం చేసేందుకు కృషి చేస్తోందని తెలిపారు. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ప్రజానాట్య మండలి బావుటా ఎగరేసిందని, ఇప్పటికీ వీధి నాటకాలతో తన సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తోందని అన్నారు. ప్రదర్శనల్లో ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు టి పెద్దిరాజు, డి నాగేశ్వరరావు, కళాకారులు అనీఫ్, కొండా నాయక్, నాగమ్మ, కె నాగేశ్వరరావు, పీటర్, నాగమ్మ భాయ్ పాల్గొన్నారు.

నిర్వాసితులను నట్టేట ముంచిన ప్రభుత్వం

- కాలనీ ఇళ్ల నిర్మాణంలో కొరవడిన నాణ్యత
- ఎపి వ్యకాస రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం
పోలవరం నిర్వాసితులను ప్రభుత్వం నట్టేట ముంచిందని, ఇళ్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు కొరవడ్డాయని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు విమర్శించారు. ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలం తాడువాయి గ్రామ పరిధిలో చల్లావారిగూడెం ఏరియాలో పోలవరం నిర్వాసితుల కోసం నిర్మిస్తున్న కాలనీలో ఆయన ఆదివారం పర్యటించారు. తొలుత నిర్వాసితుల కాలనీలోని ఇళ్ల నిర్మాణంలో లోపాలు గుర్తించి బాధితులను వివరాలు అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా వి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు పేరుతో వేల కోట్ల రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం ఖర్చుపెట్టి ఇళ్ల నిర్మాణం చేపట్టిందన్నారు. 40 శాతం ఇళ్ల నిర్మాణం పూర్తి కాలేదని తెలిపారు. ఇళ్లు నిర్మిస్తున్న కెబిఆర్ కన్‌స్ట్రక్షన్స్ యాజమాన్యం నాసిరకం మెటీరియల్ వినియోగిస్తూ ఇష్టానుసారం ఇళ్లు కడుతోందని విమర్శించారు. ఇప్పటికే నిర్మించిన ఇళ్ల స్లాబ్‌లు వర్షం వస్తే నీళ్లు కారుతున్నాయని నిర్వాసితులు వాపోతున్నారని తెలిపారు. వేతనాలు ఇవ్వకపోవడంతో ఇతర రాష్ట్రాల కార్మికులు పని మానేసి వెళ్లిపోయారని, దీంతో పనులు నిలిచిపోయాయని చెప్పారు. వీటన్నిటిపై కెబిఆర్ యాజమాన్యంపై కలెక్టర్, ఆర్‌డిఒ, ఐటిడిఎ పిఒ చర్యలు చేపట్టకపోవడం శోచనీయమని అన్నారు. పోలవరం నిర్వాసితుల ఇళ్ల నిర్మాణంలో చోటుచేసుకుంటున్న అక్రమాలపై సమగ్ర దర్యాప్తు చేసి నాణ్యతా ప్రమాణాలు లేకుండా ఇళ్లు నిర్మిస్తున్న కెబిఆర్ కనస్ట్రక్షన్స్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు లేనిపక్షంలో నిర్వాసితుల సమస్యలపై రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపడతామని ఆయన హెచ్చరించారు. వెంకటేశ్వర్లు వెంట ఆ సంఘం నేతలు ఎం జీవరత్నం, ఎ ప్రభాకర్‌రావు ఉన్నారు.

నిర్మాణంలో ఉన్న ఇళ్లను పరిశీలిస్తున్న నేతలు

ఆటోను ఢీకొన్న లారీ

- ముగ్గురు దుర్మరణం

ప్రజాశక్తి - ముద్దనూరు (కడప జిల్లా)
కడప జిల్లాలో ఆదివారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ముద్దనూరు మండలం చెన్నారెడ్డిపల్లె సమీపంలో ఆటోను లారీ ఢీకొనడంతో దంపతులతో సహా ఆటో డ్రైవర్ మృతి చెందారు. సిఐ మోహన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పోట్లదుర్తి గ్రామానికి చెందిన సిరంగి దస్తగిరి(47), ఆయన భార్య సిరంగి సరస్వతి (39) కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వారికి ముగ్గురు ఆడప్లిలలు సంతానం. దంపతులిద్దరూ అనారోగ్యానికి గురవ్వడంతో వైద్యం కోసం స్వగ్రామం నుంచి ఆటోలో కొండాపురం మండలంలోని దత్తాపురం గ్రామానికి వెళ్లారు. వైద్యం చేయించుకుని తిరుగు పయనమయ్యారు. వీరు ప్రయాణిస్తున్న ఆటోను ముద్దనూరులోని చెన్నారెడ్డిపల్లె వద్ద క్వారీ లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భార్యభర్తలిద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. ముద్దనూరు ఎల్ఎమ్ కాంపౌండ్‌కు చెందిన ఆటో డ్రైవర్ పట్నం ప్రేమ్‌కుమార్ (33) తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని డ్రైవర్‌ను 108 వాహనంలో ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆటో డ్రైవర్‌కు ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మహారాజశ్రీ కృష్ణాజిల్లా గన్నవరం సీనియర్ సివిల్‌జడ్జి వారి కోర్టులో
ఓ.యస్.నెం. 37/2022
బిట్వీన్ :
గుత్తా శ్రీనివాస్ ...వాది
మరియు
చెలికాని రామచంద్రరావు, తండ్రి : సత్యనారాయణ, కొమ్ముగూడెం గ్రామం, H/o రేచర్ల పంచాయతీ, చింతలపూడి మండలం, ప॥గో॥ జిల్లా, (ప్రస్తుతం ఏలూరుజిల్లా) ఎ.పి. ..... ప్రతివాది
పైన తెల్పిన కోర్టునందు వాది ప్రతివాదిపై SPECIFIC PER FORMANCE దావా దాఖలు చేసియున్నారు. దావాలో ప్రతివాదికి కోర్టుద్వారా సమన్లు పంపిననూ ముట్టనందున ఈ పేపరు ప్రకటన ద్వారా ప్రతివాదికి సమన్లు జారీ చేయు నిమిత్తం ఉత్తర్వులు జారీ చేసినారు. సదరు ఉత్తర్వుల ప్రకారం మీరు ది. 08-12-2022 ఉదయం 10-30 గం. లకు పైన తెలిపిన కోర్టునందు మీరుగాని లేదా న్యాయవాది గారు ద్వారా గానీ గన్నవరంలోని పైన తెలిపిన కోర్టునందు హాజయి ఆక్షేపణలు ఉన్నచో దాఖలు చేసుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమున దావా తీర్మానించబడును.
(శ్రీకోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా : 08-12-2022
ఇట్లు
యల్.వేణుబాబు,
న్యాయవాది, గన్నవరం.
సెల్ : 96406 98840

మారుతున్న కాలానికి అనుగుణంగా
సాహిత్యమూ మారాలి. పాతకాలపు
సాహిత్య పద్ధతులకే కట్టుబడి
ఉండడమంటే- అది సమాజానికి
ద్రోహం చేయటమే!
- కొడవటిగంటి కుటుంబరావు

గ్రహణ కాలంలో ..!

పందులు దొర్లిన బురదగుంటలాంటి వ్యవస్థలో ..
నీ యింటి ముందు కాలువలు మురుగు కంపు కొడతాయి
అయినా ముక్కుపుటాలు మూసుకోవాలే తప్ప
ఇదేంటని అడగ్గూడదు
చినుకుపడితే చాలు, వేనవేల నీటిఅద్దాలై మెరిసే
గతుకుల రోడ్డును ముద్దాడి నీ కొడుకు నెత్తుటిపిట్టవుతాడు
ఖర్మ అనీ సరిపెట్టుకోవాలే తప్ప ఇదేమని ప్రశ్నించకూడదు
చీమలపుట్టలోకి పాములు దూరినట్టు
ఒంటికి మతాన్నీ .. కళ్లకు కులాన్నీ పులుముకొనీ
అర్ధరాత్రి నీ యింటిలోకి అరాచకవాదులు చొరబడతారు
శిలల్లా నిలబడిపోవాలేగానీ శిరసెత్తి మాట్లాడకూడదు
మరుగుదొడ్డికి పోయినట్టు .. నీ మునివాకిట
గుమ్మం ముందు ఎవడో మూత్రం పోసిపోతాడు
ముక్కూనోరు మూసుకోవాలే తప్ప గొంతు పెగలకూడదు
వీధుల్లో యధేచ్ఛగా రంకెలేస్తున్న మదపుగిట్టల కింద
నీ నట్టింట పూసిన లేతపూవు నలిగిపోతుంది
అయినా దు:ఖాన్ని దిగమింగుకోవాలే తప్ప
ఏంటీ దారుణమనీ ఎదిరించగూడదు
నీ ముందే ఎవడో కిరాతకుడు
పావురాల్ని పాశవికంగా వేటాడతాడు
గాంధారిలా కళ్లకు గంతలు కట్టుకోవాలే తప్ప
ఏంటీ అరాచకమనీ లోన అనుకోగూడదు !

ఒకసారి ఓటేసాక ..
నీ చూపుడువేలు మీద నల్లనాగు కాటేసాక ..
యిక నీవు నవరంధ్రాలూ మూసుకోవాల్సిందే!
నోరు కుట్టుకొని బతకాల్సిందే
తలకుండను మోకాళ్ల కుదురు మీద దించుకోవాల్సిందే
ఏంటీ అరాచకమని ప్రశ్నించావా ..?
రాత్రికి రాత్రే నీవు రాజద్రోహివై పోతావు
ఉన్నట్టుండి నీ యింట్లో భయపెట్టే సాహిత్యం దొరుకుతుంది
ఇనుపబూట్ల కవాతు నీ ఇంటిచుట్టూ సాగుతుంది
విచారణ కోసం లాకప్ నిన్ను పిలుస్తుంది
వేటకుక్కలొచ్చి నీ వంటగదిని వాసన చూస్తాయి
సాక్ష్యాలు నిన్నే నేరస్తుడంటాయి
న్యాయస్థానాలు నిన్ను దోషిగా తేల్చేస్తాయి
ప్రసార మాధ్యమాలన్నీ నిన్ను తీవ్రవాదిగా ప్రకటిస్తాయి
అర్ధరాత్రి బుల్డోజరొచ్చీ నీ యింటిని కూల్చేస్తుంది
నీ తాతలనాటి ఆస్తుల్ని రాజ్యం తన్నుకుపోతుంది
నేలమీద నీ ఉనికి ప్రశ్నార్థకమవుతుంది
యేళ్ల కొద్దీ ఉక్కు పంజరాల్లో ముగ్గబెట్టీ
చివరికి నీ శవాన్ని నీకే బహుమతిగా యిస్తారు !

వాళ్లు .. చీకటిరాజ్యపు వికృత నీడలు
అధికారం వాళ్ల అడుగులకు మడుగులొత్తుతుంది
తుపాకీ దడులుగట్టి సైన్యం పహారాకాస్తుంది
నీవొక్కడివే .. నిరాయుధుడువే ..
అయినా వాళ్లకు నీవంటే భయం
కొడవళ్లలాంటి నీ ప్రశ్నలంటే భయం
నీ ఆలోచనంటే భయం ..
మెదళ్ల మహా విస్ఫోటనమంటే భయం
ఒక మహా యుద్ధంలాంటి నీ మాటంటే మరీ భయం
ప్రజాక్షేత్రాల్లో విత్తులై వెదజల్లే
నీ భావజాలమంటే యింకా భయం !

సరే అలాగేకానీ .. ఈ గ్రహణకాలంలో
వాళ్లు పొద్దును మింగేసామనుకుంటారుగానీ
మరి గ్రహణం విడిచాక ..?!

– సిరికి స్వామినాయుడు
79897 89893



జ్వలిత దీపం..!

బ్రేకప్.. అన్న ఒక్క మాటతో
సరస సంభాషణలు ఎప్పుడో తెగిపడ్డాయి
ఆశించినంత రమణీయంగా లేదు
అలాగని అనుకోనంత వికర్షణ లేదు
తావిని వీడిన పువ్వులా నిస్సారంగానూ గాక
మలయ మారుతంలా హాయిగానూ లేదు..
నిన్ను వదులుకున్నాక జీవితం నిండా
అరమరికలు లేని అసహజాలే వూపిరంతా
పోనీ నువ్వున్నప్పుడైనా ప్రశాంతంగా వున్నానా?
ప్రతి జ్ఞాపకం ప్రశ్నార్థకంగా మిగిలిపోయింది..
ఆకాశంలో చంద్రుడు నిండుగా పూచినా
గుండె మీద దొర్లుతున్న అనుభవాల్ని తుడవలేక
వెన్నెల కాయని రాత్రులు ఎన్ని అనుభవించానో..?
నీకూ నాకు మధ్య కనిపించని ఆ గోడ ఒక్కటే కదా
మన మధ్య యిన్ని అనర్థాల మూల కారణం..
ప్రేమది ఒక దివ్య భాష
దానిదంతా ఓ మార్మిక కరచాలనం..
నువ్వయినా సుఖంగా వుండాలని కోరుకున్నాను
పువ్వు లేని తావి గాలికి కూడ చులకనే
జీవితాన్ని ఏ తీరాలకు యీడ్చుకు వెళుతుందో
ఆ ఒడ్డున ఒక సూర్యుడు ఉదయిస్తాడో
ఉదయించిన సూర్యుడిలాగే ఒక ఆశ పూస్తుందో
వైవాహిక జీవనం అంతుచిక్కని వైకుంఠ పాళీ కదా..!
ఎప్పుడు వెలుగుని చీకటి మింగేస్తుందో
మబ్బులు వీడిపోయి ఏ క్షణం నింగి తేటపడుతుందో
నాకు నేను వేసుకున్న అనేకానేక ప్రశ్నల మధ్య
సమాధానాల మైలు రాళ్ళు వుంటాయా..?
నీవు,నేనూ రాజీపడలేని అడుగు దూరంలో
వొంటరొంటరిగానే నడక సాగించాలా..?
ఎంతదూరం యీ నిశిరాత్రి ఎడారి ప్రయాణం..?
శాంతికీ, కాంతికీ ఎడబాటై విచిత్ర భ్రాంతిలో
జీవితానికి నిర్వచనం సర్దుబాటు అనే స్పృహ మరచి
బతుకు అంచుమీద ఏకాంతాన్ని నాటుకోవటమేనా
చివరి వరకు...?
పెళ్ళంటే రెండు హృదయాల
అఖండ జ్వలిత దీపం కదా..??

– డాక్టర్ పెరుగు రామకృష్ణ
98492 30443

గురజాడ పురస్కారం చాగంటికి ఇవ్వతగదు



విజయనగరంలో వున్న సాహిత్య, సాంస్కృతిక సంస్థలన్నీ కలిసి 'గురజాడ సమాఖ్య' పేరుతో ఒక సంస్థగా ఏర్పడ్డాయి. గత కొన్నేళ్లుగా ఆ సమాఖ్య గురజాడ పేరిట ఒక వార్షిక అవార్డును ఎంపికచేసిన వారికి నవంబరు 30వ తేదీన ప్రదానం చేస్తోంది. కొన్ని పోటీలు పెట్టి విజేతలకు బహుమతులు కూడా ఇస్తోంది. గురజాడ సాహిత్యంపై సభ కూడా జరుపుతున్నారు. అందుకు వారు అభినందనీయులు. అయితే, నగరంలోని అన్ని సంస్థలకూ ప్రాతినిధ్యం ఉందని మాట వరుసకు అన్నా- మిగతా సంస్థలను సంప్రదించరు. ఆ సంస్థల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోరు. నలుగురైదుగురి ఏకపక్ష నిర్ణయాలతోనే సమాఖ్య నడుస్తుంది. అయినా పెద్దగా ఆక్షేపణ లేదు. ఆక్షేపణీయం ఏమిటంటే గురజాడ పేరు మీద ఇస్తున్న అవార్డు ఎవరికి ఇస్తున్నారు అన్న దాని మీదే!

ఈ ఏడాది ఈ అవార్డును ప్రవచనకర్త చాగంటి కోటీశ్వరరావు గారికి ఇవ్వడానికి నిర్ణయించారు. ఈ నిర్ణయం సెప్టెంబరులోనే జరిగింది. అది సరైన నిర్ణయం కాదు. గురజాడ ముందుచూపు ఉన్న వాడు. ప్రగతిశీలవాది, భౌతికవాది, ఆచరణవాది. చాగంటి వారు అందుకు పూర్తిగా భిన్నమైన దృక్పథం, ఆచరణ కల ప్రవచనకర్త. పురస్కార ప్రకటనకు మేము అభ్యంతరం చెబితే- 'మేము గురజాడ అభ్యుదయ అవార్డు అని ఇవ్వడం లేదు. అయినా గురజాడను వేలాదిమందికి తెలిసేలా చేస్తున్నాం. ఇది మంచిదా లేక చాలా తక్కుమందిలో జరపడం మంచిదా' అన్న వాదన తెస్తున్నారు, సమాఖ్య వారు.

గురజాడ ఒక్క విజయనగరానికే పరిమితమైన వారు కాదు. ప్రపంచ తెలుగు ప్రజలకు మహాకవి. కోట్లాదిమంది తెలుగు ప్రజలు ఆయన భావాలను ఏ దేశం వారికైనా వారి అభివృద్ధికి మార్గమని భావిస్తున్నారు. ఆయన అడుగుజాడల్లో సాహితీ, సాంఘిక చైతన్యాన్ని రగిలిస్తున్నారు. అందులో భాగంగా ఆయన సాహిత్యాన్ని పరిశోధించి ప్రచురించి ప్రజలకు చేరేటట్లు చేశారు రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రగతిశీల వాదులు, అభ్యుదయవాదులు. గురజాడ భావాలను ప్రజలకు చేర్చి తన్మూలంగా సమాజ ప్రగతి కాంక్షిస్తున్నారు. ప్రతిఏటా వందలాది సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నారు. తద్వారా లక్షలాది మందికి గురజాడ ప్రగతిశీల భావజాలం చేరుతుంది.

అంతెందుకు? విజయనగరంలో నూరేళ్ల కన్యాశుల్కం సందర్భంగా ఒక ఏడాది పాటు ప్రతినెలా సభలూ, సమావేశాలు నిర్వహించి తెలుగు రాష్ట్ర నలుమూలల నుంచి సాహితీవేత్తలను ఆహ్వానించి ఆ సభల్లో మాట్లాడించలేదా? ఆ సందర్భంగా కన్యాశుల్కం పూర్తి నాటకం (9 గంటలు) ప్రదర్శించినది అభ్యుదయ సంస్థలు కాదా? గురజాడ శత వర్ధంతి సందర్భంగా దేశభక్తి గీతాన్ని లక్ష కాపీలు ముద్రించి అన్ని స్కూళ్లకు చేర్చి పిల్లలతో ఆ గీతాన్ని ఆలపించడానికి ప్రోత్సహించలేదా? శత వర్ధంతి సందర్భంగా విశాఖపట్నం ఆంధ్రా యూనివర్శిటీలో వేలాదిమందితో ఊరేగింపు, సభ జరపలేదా? 2014, 2017లలో వైజాగ్ ఫెస్ట్ సందర్భంగా 200 పైగా ప్రచురణ సంస్థలతో బుక్ ఎగ్జిబిషన్ ఏర్పరచి ఆ ప్రాంగణంలో 'గురజాడ' సాహిత్య వేదికపై నుంచి పదేసి రోజులపాటు సాహిత్యసభలు, కవి గాయక సమ్మేళనాలు నిర్వహించలేదా? ఈ సంగతులు వారి దృష్టిలో లేవా? లేక విస్మరించారా? ఇప్పటి సమస్య ఎవరు ఎంత చేశారు అన్నది కాదు. గురజాడ భావజాలం ఏమిటి, వారి పేరు మీద పురస్కారం ఎవరికి ఇస్తున్నారనేది ప్రస్తావన.

'మనిషి చేసిన రాయి రప్పకి
మహిమ కలదని సాగి మొక్కుతు
మనుషులంటె రాయి రప్పల కన్న కనిష్టం
గాను చూస్తా లేలా బేలా?
దేవుడెకడో దాగెనంటూ/ కొండకోనల వెతుకులాడే వేలా?
కన్ను తెరచిన కనబడడో?
మనిషి మాత్రుడి యందు లోడో?
యెరిగి కోరిన కరిగి యీడో ముక్తి' అన్నారు గురజాడ.

దేవుడిని మనిషే సృష్టించాడు కాబట్టి లేని దేవుడి కోసం కొండ కోనలు వెతక వద్దు. నీకు నీతోటి మనిషి మాత్రమే సహాయ పడగలడు కావున ఆసత్యాన్ని గ్రహించి మనిషిని ప్రేమించమన్నాడు ఆయన.

'మగడు తేల్పన పాత మాటది/ ప్రాణమిత్రుడ నీకు/
నీనెనరు/ కలుగక యున్న పేదను కలిగినను
నా పదవి వేల్పుల రేని కెక్కడీ' అని జీవిత భాగస్వామిని ప్రాణమిత్రుడిగా పరిగణించారు. 'ఆధునిక మహిళ చరిత్రను పునర్లిఖిస్తుంది' అని చెప్పారు. 'మలిన దేహుల మాలలనుచును/ మలిన చిత్తుల కధిక కులముల/ నెల నొసంగిన వర్ణధర్మ మధర్మ ధర్మంబే' అని ఈ వర్ణ వ్యవస్థ అధర్మము అని చాటి చెప్పారు. 'కన్ను కానని వస్తుతత్వము/ కొంచ నేర్చరు వింగి రీజులు/ కల్లనొల్లరు వారి విద్యల/ కరచి సత్యము నరసితిన్', 'దూర బంధువు భూమికి/ దారి బోవుచు చూడవచ్చెను/ డెబ్బ దెనుబడి యేండ్ల కొక తరి/ నరుల కన్నుల పండువై/ తలతు నేనిది సంఘ సంస్కరణ/ ప్రయాణ పతాక గాన్' అన్నారు.

తోకచుక్క కనిపించిన సందర్భంగా సాంప్రదాయవాదులు ఇది అరిష్టానికి సూచన అని ప్రజలను భయభ్రాంతులకు గురిచేసినపుడు 'భయపడాల్సిన అవసరం లేదు. తోకచుక్క రాకను సంఘ సంస్కరణోద్యమానికి పతాకగా తలుస్తాను' అని చెప్పారు గురజాడ. ఈ సత్యాన్ని నేను ఇంగ్లీషు వారి వస్తుతత్వ భౌతికవాద ఆలోచనల విద్య నుంచి గ్రహించానని చెప్పారు. 'మతములన్నియు మాసిపోవును/ జ్ఞానమొక్కటి నిలిచి వెలుగును/ అంత స్వర్గ సుఖంబులన్నవి/ యవని విలసిల్లున్'. శాస్త్రజ్ఞానం పెరిగిన కొలది మత ప్రభావం తగ్గి చివరికి మతాలు కనుమరుగౌతాయి.. జ్ఞానం మాత్రమే మరింత జ్ఞానాన్ని సంపాదించి కొనసాగుతుంది' అని చెప్పారు. జ్ఞానవంతుల సమాజమేర్పడడం ద్వారానే ఊహిస్తున్న స్వర్గ సుఖాలు ఈ భూమి పైనే సాకారమౌతాయి అని నొక్కి వక్కాణించారు. 'అన్నదమ్ముల వలెను జాతులు/ మతములన్నియు మెలగవలెనోయ్' అని ప్రబోధించారు. 'వెనుక చూసిన కార్యమేమోయి/ మంచి గతమున కొంచమేనోయి/ మందగించక ముందుకడుగేయ్/ వెనుక బడితే వెనుక నేనోయ్' అన్నాడు.

అలాంటి దూరదృష్టి గల గురజాడ భావాలకు విరుద్ధమైన భావాలను ప్రచారం చేస్తూ ప్రవచనాలు చెబుతున్నారు చాగంటి కోటేశ్వరరావు గారు. ఆయన ప్రవచనాల్లో ఎక్కువ భాగం అసత్యాలు లేక అర్ధసత్యాలు. స్త్రీల విషయంలో మనువాద భావాలను ప్రచారం చేస్తున్నారు. అవే గొప్ప విషయాలుగా భావించేట్లు ఉద్బోధిస్తారు. వర్ణ వ్యవస్థ కొనసాగాలని చెబుతారు. నెమలి స్ఖలించకుండానే సంతానోత్పత్తి చేస్తుందని అసత్యాలు ప్రచారం చేస్తారు. ఆయన ప్రసంగాలన్నీ యూట్యూబ్‌లో ఉన్నాయి. ఎవరైనా పరిశీలించవచ్చు. అన్ని విషయాలపైనా అభ్యంతరం చెప్పడం మా ఉద్దేశం కాదు. ఆయనని అభిమానించేవాళ్లు, అనుసరించేవారు, ఆయన చెప్పిన విషయాలను నమ్మేవారు ఉండొచ్చు. అది వారి ఇష్టం. వారితో పేచీ లేదు. వారి అభిప్రాయాలను, ఇష్టాలను గౌరవిస్తాం.

అభ్యంతరమల్లా పై అన్ని విషయాల ప్రాతిపదికన గురజాడ పురస్కారాన్ని చాగంటి వారికి ఇవ్వడంపైన. గురజాడ పురస్కారం చాగంటి వారికి ఇవ్వడం అసమంజసం అన్నది మా భావన. అభ్యంతరాలను లెక్క చేయకుండా సమాఖ్య వారు తాము తీసుకున్న అహేతుకమైన నిర్ణయంతో ముందుకు పోతున్నారు. ఈ దశలో ఆలోచించినపుడు గురజాడ ఆనాడు వాడుక భాష విషయమై తన 'అసమ్మతి పత్రాన్ని' ఇచ్చినట్టు- మనం కూడా మన అసమ్మతి తెలియచేయడం ఉత్తమమని అనిపించింది. గురజాడను అభిమానించే వ్యక్తులను, సంస్థలను ఈ పురస్కారం చాగంటి వారికి అందచేయడానికి నిరసనగా మీ అసమ్మితి ప్రకటించమని కోరుతున్నాము. మీ అసమ్మతిని ఏ ప్రక్రియలో అయినా తెలియచేయవచ్చు. వ్యాసం, గల్పిక, ప్రహసనం, కవిత, పద్యం, గేయం, చిన్నకథ ఇంకేదైనా మీకు నచ్చిన విధంగా ఉండవచ్చు. అందరి అసమ్మతి పత్రాలను విజయనగరంలో నిరసన కార్యక్రమంలో గురజాడ విగ్రహానికి సమర్పిస్తాము. మీ అసమ్మతి పత్రాలను ఈ కింది నెంబరుకు వాట్సప్ గాని ఇమెయిల్ ద్వారా గాని **25.11.2022**లోగా లోగా పంపించండి. అదే సమయంలో మీ మీ సామాజిక మాధ్యమాల ద్వారా కూడా ప్రకటించండి. 'పూను స్పర్ధను విద్యలందే/ వైరములు వాణిజ్యమందే' అని గురజాడే చెప్పారు. ఇది కలహం కాదు, వైరం అంత కంటే కాదు. గురజాడ సమాఖ్యను నిర్వహిస్తున్న పెద్దలతోగాని, చాగంటి వారితో గాని వ్యక్తిగతంగా ఎలాంటి వ్యతిరేకతా లేదు. ఈ సందర్భంగా ఈ విషయం పట్ల మాత్రమే భిన్నాభిప్రాయం ఉందని అర్థం చేసుకోవలసినదిగా మనవి. **వాట్సాప్ నెం: 94411 76882**

ఇట్లు
సాహితీ స్రవంతి, అరసం,
ప్రజాసాహితి, శ్రీకాకుళ సాహితి,
స్నేహకళాసాహితి, వెలుగు,
రాజాం రచయితల సంఘం,
సహజ సాహిత్య, సాంస్కృతిక సంస్థలు;
ఇంకా గురజాడను అభిమానించేవారు,
అనుసరించేవారు.

కమ్మని కవితల పూలవాన



వానంటేనే అద్భుత దశ్య కావ్యం. ఇంక పూలపూల వానంటే ఎంత పరిమళ భరితమో కదా! ఒక్కో చినుకు నేలను తాకుతూ చిన్ని చిన్ని రేణువులుగా విస్ఫోటనం చెంది చిందులేస్తుంటే అది ఒక మనోహర దృశ్యం. పెద్ద వాళ్ళయితే బాల్యపు గది తలుపులు తెరవడమో లేక తలపుల్లో తడవడమో చేస్తారు. పిల్లలయితే అల్లరిగా వెళ్ళి చినుకులను వాళ్ళకు నచ్చిన ఆటల్లోకి ఒంపేసుకుంటారు.

'పూల పూల వాన' డా.ఏనుగు నరసింహారెడ్డి కవిత్వం. ఈ టైటిల్ చూసి కవిత్వం నిండా వాన ఉంటుందని అనుకుంటే పొరబాటే. కవిత్వంలో వాన కాదు, ప్రతి కవిత చినుకంత చిన్నగా చదువుతుంటే వానలో తడుస్తున్నంత హాయిగా ఉంటుంది. ఇది ఒక లఘు కవితల సమాహారం.

రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ మంచి సాహితీవేత్తగా అందరికీ సుపరిచితులైన డా.ఏనుగు నరసింహారెడ్డి ప్రస్తుతం మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. వీరు వచన కవిత్వం, రుబాయిలు, పద్యాలు, అనువాదాలు, విమర్శనా వ్యాసాలు ... ఇలా అనేక ప్రక్రియల్లో తనదంటూ ఓ ప్రత్యేక శైలితో సాహిత్య ప్రయాణం కొనసాగిస్తున్నారు. వీరు ప్రభుత్వ ఉన్నతాధికారి, ప్రముఖ సాహితీవేత్త మాత్రమే కాదు... మృదుభాషి, మంచి స్నేహశీలి.

ఈ పుస్తకంలో మూడు లేదా నాలుగు చిన్ని చిన్ని పాదాల లఘు కవితల్లో కవి తన మనసులోని భావాలను, స్పందనలను అక్షరీకరించారు. ఈ పుస్తకానికి ఈ పేరు పూర్తిగా సరిపోతుంది. తమ ముందుమాటలో మనల్ని ఓ మాట అడుగుతారు. 'ప్రకృతిలో నడుస్తున్నప్పుడో, వ్యక్తులతో మాట్లాడుతున్నప్పుడో, పరవశించినప్పుడో, పస్తాయించినప్పుడో కొన్ని ఊహల ముత్యాలు రాలుతుంటాయి. అవి కాగితం చెట్టుమీద తమకు తాము పోతపోసుకున్న పూలైపోయాయి. అవి రాతల రత్నాలై నేను పాసయ్యానా లేదా మీరు చెబితేనే తెలిసేది...' అని. ఈ కవి నూరు శాతం కన్నా ఎక్కువ మార్కులతోనే పాసయ్యారని చెప్పొచ్చు. ఇది 'పూల పూల వాన' మాత్రమే కాదు; అక్షరాలా 'ముత్యాల పూల వాన'.

'అంత విశాలమంటారా ఆకాశాన్ని/ ఆనందంతో గంతులేయడానికి/ అంతరంగమంత పెద్దదేదీ/ నాకింతవరకు కనపడనే లేదు' .మొదటి లఘు కవిత ఇది. మనసే ఈ విశ్వంలో అత్యంత విశాలమైనది అంటూ మనసుకు పెద్ద పీట వేశారు. మనసు అత్యంత విశాలమైనదే కాదు, అత్యంత సున్నితమైనది కూడా. మనసులో సున్నితత్వం కొరవడితే అది మనకు విశాలంగా కూడా కనిపించదు. 'తాటిచెట్టులో/ కల్లొక్కటే చూస్తే ఎలా/ ఆ తల్లి కావ్యాల్ని మోసింది...' వహ్వా అని అనలేకుండా ఉండలేం. గ్రంథాలు, కావ్యాలు అన్నింటినీ మోసిన తాటిచెట్టులో కల్లొక్కటే చూస్తే ఎలా? పేదవారి ఎన్నో పూరి గుడిసెలకు కూడా తానేగా పైకప్పు, వారి స్వేదాన్ని సాంత్వన పరిచే విసనకర్ర... ఎంత ఆత్మీయురాలు కదా ఈ తాటి చెట్టు. 'ఎదిగిన వాళ్ళను చూసి/ అసలే ఏడ్వలేదా, అయితే నువ్వు/ తప్పక ఎదిగే ఉంటావు'. అక్షర సత్యం ఇది. ఎదుటి వాళ్ళ ఉన్నతిని కాంక్షించే వాళ్ళు ఎంతో సహృదయంతో ఉంటారు. వాళ్ళల్లో ఈర్ష్యా ద్వేషాలు ఎప్పుడో నశించి ఉంటాయి.

'పదే పదే చెప్పకు/ పునరుక్తి ఎక్కువైతే/ చెప్పేది నిజమే అనే/ సందేహం పురుడు పోసుకుంటది.' ఇది కవిత్వం స్టేజ్ పైన చదివే కవులకు తప్పకుండా వర్తిస్తుంది. ఒక కవితలో ఎక్కడో ఓ చోట కొన్ని పాదాలను పునరుక్తి చేస్తే బాగుంటుంది. కానీ ఇటీవల కొద్దిమంది ప్రతి పాదాన్ని పునరుక్తి చేస్తూ ఎదుటి వాళ్ళు వినలేనంతగా విసిగించడం జరుగుతోంది.

'అందిపుచ్చుకోలేక/ ఆమెను కవిత్వంలో చిత్రించాను/ అక్కడ కూడా నవ్వమని ఎవరన్నారు/ కాస్త భావుకతతో కూడిన ఓ అందమైన ఊహ. ఊహలెపుడూ మనోహరంగా ఉండాలి. మనసును అప్పుడప్పుడు ఉల్లాసంగా ఉంచేందుకు....

'నీ అయ్య జాగీరా?/ అనలేక పోతుంది ప్రజ
ఆఫీసులో చూసి మనల్ని' ఎంత నిష్పక్షపాతంగా ఈ విషయాన్ని రాశారో అనిపించింది ఇది చదివాక. కొన్ని కార్యాలయాల్లో మనం నిత్యం చూస్తూనే ఉంటాము అధికారుల నిర్లక్ష్యాన్ని. మన మనసుల్లో ఉప్పెనలా ఎగసే ఆవేశం, ఆవేదనా ఎన్నో అనాలని అనిపిస్తుంది. ఏమీ అనలేక అసహాయంగా ఇలా మనసులో అనుకుంటాం.

'ఫైళ్ళను నిర్లక్ష్యం చేయకు/ అవి నీ ముందు సాష్టాంగ పడ్డ దైన్యాలు' .... ఇలాంటి ఎన్ని చురకలు వేయాలో, ఎంత సమర్పించుకోవాలో మన పనులు సజావుగా సాగాలంటే... మన ఫైళ్ళు ముందుకు కదలాలంటే...

ఏచపల చిత్తుడు చంద్రుడు/ రోజూ ఒకలా అసలుండడు.' నిజమే... చంద్రుడే కాదు మనుషులు కూడా అస్సలు ఒకలా ఉండడం లేదు. 'తిరుగు ప్రయాణం లేని/ చివరి రైలెక్కక ముందే/ ఎవరికైనా బాకీ పడ్డామేమో/ తరచి తరచి చూసుకోవాలి.' గొప్ప వాక్యాలు ఇవి. ప్రతి ఒక్కరికీ వర్తిస్తుంది. జీవితం చరమాంకం ముందే మనం నిర్వహించాల్సిన ఎన్నో పనులను ముగించాలి, బాకీలకు లెక్క చూడాలి. అందరి గుండెల్లో కొంతకాలమైనా మనమో జ్ఞాపకమవ్వాలి. 'వాడు కత్తి పట్టుకుని/ పూవుల్ని కోసేయగలడేమో కానీ/ రాబోయే వసంతాన్ని/ ఏ ఆయుధమూ ఆపలేదు.' ఒక విప్లవ స్వరాన్ని గొంతు నొక్కి అణచేసినంత మాత్రాన విప్లవమనేది అక్కడితో ఆగిపోదు. అది మరింతగా ఉద్భవిస్తుంది వేయి గొంతుకలతో తన స్వరాన్ని విన్పిస్తుంది.

'హృదయం పూర్తిగా పునీతం కావాలంటే/ రెప్ప మూయకుండానే/ కారిపోయేంత కన్నీరు కావాలి.' గుండె బరువును తగ్గించుకోవాలంటే గుండెలోని బాధ నదిలా మారాలి. తేలికయ్యేంత వరకు మనసు తెరిపిన పడేంత వరకు... 'ఎవ్వరికీ తెలియని చీకట్లో/ కొత్త వెలుగుల తారాజువ్వవు కా/ దీపావళి అమావాస్య నాడే/ ఎందుకు పెట్టారో తెలుసుకో.' బతకడమంటే ఏదో ఒకలా బతకడం అందరిలా మరలిపోవడం కాదు... మన బతుకు మరి కొన్ని బతులకు వెలుగవ్వాలని అమావాస్య నాటి దీపావళిలా ప్రభవించాలని అంటున్నారు కవి. ఈ లఘు కవితలన్నీ గొప్ప సందేశాత్మకంగా ఉన్నాయి. చదివితే ఓ సన్నని వాన తుంపరల్లో తడిసిన అనుభూతి కలుగుతుంది. మంచి పుస్తకాన్ని అందించిన డా. ఏనుగు నరసింహారెడ్డి గారికి హదయ పూర్వక అభినందనలు.

– శాంతి కృష్ణ
95022 36670

నవరసభరితం నిశుంబిత నటోత్సవం

హైదరాబాదులోని నిశుంబిత స్కూల్ ఆఫ్ డ్రామా నట శిక్షణ పొందిన విద్యార్థులు- రచయిత దర్శకుడు రామ్మోహన్ హొళగొంది నేతృత్వంలో నవంబర్ నెల 12 13వ తేదీలలో ఉదయం సాయంత్రం మొత్తం నాలుగు పూటల్లో రోజుకి 11 చొప్పున 22 రంగస్థల 'ఏకవ్యక్తి' ప్రదర్శనలు చోటు చేసుకున్నాయి. ఒక్కొక్క ప్రదర్శన 45 నిమిషాలకు తగ్గకుండా ఇచ్చిన ఈ మోనో ప్రదర్శనలన్నీ ఉన్నత స్థాయికి చెందిన రంగస్థల ఏకపాత్రల అభినయం మరొకసారి రికార్డు నెలకొల్పింది. గత మార్చి 27వ తేదీన ప్రపంచ రంగస్థల దినోత్సవ సందర్భంగా 27 ప్రదర్శనలు ఏకబిగిన ప్రదర్శించిన నిశుంబిత రామ్, ఇలాంటి చరిత్రనొకదానిని తన సొంతం చేసుకున్న దర్శక, రచయిత.

రెండు రోజుల్లో తెలుగు, హిందీ, ఇంగ్లీష్ భాషల్లో పిల్లల, స్త్రీల జీవితాల్లోని ఆనంద విశాదాలకు, అనుభూతులకు అద్దం పట్టగా, మరొక రెండు విభాగాల్లో మొత్తం వర్తమాన సమాజంలోని సమస్యలు, పోకడలు, ఆధునిక సాంకేతిక సమాచార విప్లవం మనిషి జీవితంలో ఎలాంటి మార్పులు తీసుకువస్తున్నాయో, వాటి పరిణామాలు- ఫలితాలు ఎలా ఉంటున్నాయో, ఎలా పరిణమించబోతున్నాయో- అన్న ఆలోచనాత్మక సద్విమర్శకు సహానుభూతి, మానవతా కోణం నుంచి చర్చించి ప్రేక్షకుడిని ఆలోచన ముద్రలో ముంచి తేల్చిన ప్రదర్శనలు. రంగస్థలం ప్రదర్శన జీవితానికి, జీవిత గమనానికి, జీవితంలోని అసంబద్ధ అహేతుక అశాస్త్రీయ మూఢనమ్మక మూస ఆలోచన ధోరణికి, నవరసాత్మకమైన జీవితంలోని పలు కోణాలను, అద్దం పడుతూ, మేధోపరమైన చింతనాత్మక ధోరణిలో ఈ ప్రదర్శనలు సాగాయి.

ఇవన్నీ రచన నటన దర్శకత్వం సాంకేతిక విలువలతో కూడి భారతీయ సమకాలీన నాటక రంగానికి మచ్చుతునకలుగా, జీవన శకలాలుగా భాసించాయి. ఒక రచయిత దర్శకుడు ఎంత వినూత్నంగా ఆలోచిస్తూ భవిష్య దర్శనం చేస్తూ వర్తమానంలో దారి తప్పకుండా సమాజానికి మేలుకొలుపు పాడగలడో దర్శింపచేసాయి. శిక్షణ- ఒక విద్యార్థిలోని ప్రతిభా నైపుణ్యాలకు ఎలా మెరుగులు దిద్ది సాన పట్టి వజ్రంలా ప్రకాశింప చేస్తుందో ప్రత్యక్షంగా దర్శించే అవకాశాన్ని కల్పించింది.

శనివారం 12వ తేదీ ఉదయం ఒరేయ్ చెత్తోడా, మత్తు, ఆలస్యం, మ్యావ్-నల్ల పిల్లి అడ్డమొచ్చింది, సత్య - వీడు అదో టైపు, ప్లే లలో... చెత్త సేకరించి పరిసరాలను శుభ్రంగా ఉంచే వ్యక్తి జీవితంలోని విషాదాన్ని చూపిస్తే, మత్తు మాదకద్రవ్యాల దుష్పరిణామాలు- వ్యక్తి వాటికి బానిసగా మారితే ఏ స్థాయి నుండిన అతడిని ఏ అగాధాల్లో పడదోస్తుందో చెబుతుంది. 'పంది' బాడీ షేమ్ విషయ వస్తువుగా ఊబకాయంతో ఎన్ని అవమానాలు హేళనలు ఒక యువకుడి జీవితంలో చోటు చేసుకున్న విభిన్న పరిస్థితులను కళ్ళకు కట్టింది. మనిషి తన జీవిక కోసం ఎన్ని అపమార్గాలు పట్టి, సమాజంలో ఎన్ని దుష్కృత్యాలు చేయగలడో- సత్య- వీడు అదో టైపు- మ్యావ్! నల్లపిల్లి అడ్డమొచ్చింది- లో ఒక బామ్మ గారి మూఢ నమ్మకాలు- బాలుడు నుంచి యువకుడి దాకా ఎరిగిన పరిణామ క్రమంలో ఎదుర్కొన్న ఒడిదుడుకులను హాస్యధోరణిలో చూపిస్తుంది.

ఇక సాయంత్రం స్లాట్లో ఇస్కీతో.. మోనో ప్లే, మొబైల్ అడిక్షన్ ఒక యువతి జీవితంలో నింపిన విషాదాన్ని చూపిస్తే; ఏక్ కహానీ'- ఒక ట్రాన్స్ జెండర్ జీవితంలోని విషాద పరంపరను శోక రసంలో రంగరించి చూపింది. బ్రాహ్మిన్ హెూ!?.. ఒక కులంలో పుట్టడం ఖర్మ, తప్పిదమా? వ్యక్తి ప్రమేయం ఇందులో ఏ మేరకు? కులం కారణంగా ఒకప్పుడు పంచమ వర్ణంగా పిలవబడిన వారు అనుభవిస్తే.. నేడు సమాజంలో మారిన పరిస్థితులకు ఒక అగ్రవర్ణంగా చెప్పబడే వ్యక్తి జీవితంలోని అగచాట్లను దృశ్యమానం చేసింది. తాల్ - ఏ డాన్సర్స్ లైఫ్' స్త్రీని భోగ వస్తువుగా చూస్తూ, తమ క్షణిక శారీరక సుఖం కోసం మగజాతిలో కొందరు కాముకులు ఎంతటి ఉత్పాతాన్ని సృష్టించి ఒక యువతి జీవితంతో ఆడుకోవడాన్ని కరుణాసాత్మకంగా చూపింది.

వివిధ మతాల్లో బాహ్యాడంబరంతో జరిగే ఉత్సవాలు, వేడుకలు, ప్రార్థనలు వీటి వింత వింత పోకడలను చూపిస్తూ.. జంతుబలి, ఆహారం వృధా చేయడం, పర్యావరణ కాలుష్యం మొదలైన అంశాలతో నిజంగా భగవంతుడు అనే వాడు ఉంటే చూస్తున్నాడా? చూస్తూ మౌనం వహిస్తున్నాడా? మెచ్చుకుంటాడా? నొచ్చు కుంటాడా?.. ఇలా అనేక సంఘటనలు హాస్య వ్యంగ్య ధోరణిలో సాగిన ప్రదర్శన ఒకటి.

ఇక 13వ తేదీ ఉదయం బాలల నాటికలు- పాపం పసివాళ్లు, మేరీ దునియా, గలీకా కుత్తా, హెూమ్ స్వీట్ హెూమ్, మిస్ పర్ఫెక్ట్ ఏకపాత్రలు- పిల్లల ప్రపంచంలోనికి తీసుకువెళ్లాయి. పిల్లలు కూడా పిడుగులై, తమ నటనా సామర్థ్యంతో ఈ కాలం పిల్లలు ఎలా ఉన్నారు? ఏం కోరుకుంటున్నారు? పెద్దలు- పిల్లల జీవితాన్ని మంచిగానో, చెడుగానో ఎలా ప్రభావితం చేస్తారో? అలాగే ఒక వీధి కుక్క జాలి బతుకు, ఎన్ని ప్రతాడనలకు గురికాబడినా ఆత్మ న్యూనతా భావంలో నుంచి, కౌమార దశలోని యువతి- తన్ను తాను ఎలా ఉన్నతీకరించుకున్నదో అభినయ కౌశలంతో చూపిన వైనం.. బాలల దినోత్సవ నేపథ్యంగా పిల్లలను పెద్దలను ఆలోచింప చేశాయి.

13వ తేదీ సాయంత్రం చివరి స్లాట్ లో- ఐయామ్ నాట్ ఫెమినిస్ట్, జోకర్, ఉయ్ టూ, రిఫ్లెక్షన్, సర్వైవర్, అన్న ఆంగ్ల మోనోప్లేలు ప్రదర్శితమయ్యాయి. భాషలు వేరు, నట నటీనటులు వేరుగాని- జీవితం మాత్రం ఒక్కటే! అది వ్యక్తమైన తీరే వైవిధ్యం.దాన్ని కళాత్మకంగా, పటిష్టమైన రచనా దర్శకత్వంతో, సుశిక్షితులైన విద్యార్థినీ విద్యార్థులు తమ తమ పాత్ర పోషణ ఎంత వాస్తవికంగా ప్రదర్శించి మెప్పించవచ్చో అన్నదానికి ఉదాహరణలుగా నిలిచాయి. మొత్తం మీద నటోత్సవ్- 7, రెండు రోజుల 22 మోనో ప్రదర్శనలు ప్రేక్షకులు తమను తాము, తామున్న సమాజాన్ని 64 కోణాల్లో దర్శించుకోవడానికి ఆత్మ విమర్శ చేసుకోవడానికి, తను తన నిష్క్రియాపరత్వం నుంచి సామాజిక చైతన్యం దిశగా నడవడానికి, నడిపించడానికి చక్కని పథ నిర్దేశం చేశాయి.

– మల్లేశ్వరరావు ఆకుల
79818 72655

మూడింట రెండొంతుల మందికి మొండిచేయి

- పిఎం కిసాన్ నుంచి 8 కోట్ల మంది రైతులు అవుట్
- మూడేళ్లలోనే 67 శాతం మంది తగ్గుదల
- ఏపిలో 27.48 లక్షలు, తెలంగాణాలో 14.78 లక్షల మంది తగ్గుదల
- కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ గణాంకాల వెల్లడి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పిఎంకిసాన్) లబ్ధిదారులైన రైతుల్లో మూడింట రెండొంతుల మందికి మోడీ సర్కారు మొండిచేయి చూపించింది. 2019 ఫిబ్రవరిలో మొదటి విడత నుంచి 2022 మే-జూన్‌లో 11వ విడత వరకు పిఎం కిసాన్ లబ్ధిదారుల సంఖ్య 11.84 కోట్ల నుంచి 3.87 కోట్లకు తగ్గింది. 67 శాతం తగ్గుదల నమోదైందని, 7.97 కోట్ల మంది లబ్ధిదారులు పిఎంకిసాన్‌కు దూరం అయ్యారని కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. హక్కుల కార్యకర్త కన్హయ్యకుమార్ దాఖలు చేసిన సమాచార హక్కు చట్టం దరఖాస్తుకు కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ సమాధానం ఇచ్చింది. 11వ విడత నిధులను పొందిన రైతుల సంఖ్య 67 శాతం తగ్గిందని తెలిపింది. 2022 మే-జూన్‌లో 11వ విడత రూ.2,000ని కేవలం 3.87 కోట్ల మంది రైతులకే వారి ఖాతాల్లో జమ చేసినట్లు కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ తెలిపింది. 2019 ఫిబ్రవరి 2019లో మొదటి విడతను పొందిన 11.84 కోట్ల మంది రైతులతో పోలిస్తే ఇది గణనీయంగా తగ్గింది. 12వ విడత అక్టోబర్ 2022లో పంపిణీ చేశారు. మొదటి విడతలో 11.84 మంది రైతులుండగా, 9.87 కోట్ల మంది రైతులకు అందిన ఆరో విడత నుంచి క్రమంగా తగ్గుదల చోటుచేసుకుంది. ఏడో విడతలో 9.30 కోట్లకు, ఎనిమిదో విడత 8.59 కోట్లకు, తొమ్మిదో విడత 7.66 కోట్లకు, పదో విడత 6.43 కోట్లకు లబ్ధిదారుల సంఖ్య తగ్గుతూ వచ్చింది.

ఏపిలో 27.48 లక్షలు, తెలంగాణాలో 14.78 లక్షల మంది రైతులు తగ్గుదల

ఆంధ్రప్రదేశ్‌లో పిఎం కిసాన్ లబ్ధిదారుల సంఖ్య 55.68 లక్షల నుంచి 28.2 లక్షలకు తగ్గిందని, ఈ మూడేళ్లలో 27.48 లక్షల మంది తగ్గారని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. తెలంగాణలో మొదటి విడతలో 39.10 లక్ష మంది రైతులకు పిఎంకిసాన్ అందగా, 11వ విడతకు వచ్చే సరికి 24.32 లక్షల మంది రైతులకు తగ్గారు. ఈ మూడేళ్లలో 14.78 లక్షల మంది రైతులు పిఎం కిసాన్ నుంచి తొలగించబడ్డారు. బీహార్‌లో లబ్ధిదారుల సంఖ్య 83 లక్షల నుండి ఏడు లక్షలకు తగ్గగా, ఛత్తీస్‌గఢ్‌లో 37 లక్షల నుంచి రెండు లక్షలకు తగ్గినట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఎన్నికల నేపథ్యంలో గుజరాత్‌లో 2019లో 63.13 లక్షల మంది రైతులు ఈ మొత్తాన్ని పొందగా, 2022లో 28.41 లక్షల మంది రైతులే ఈ పథకం ద్వారా లబ్ధి పొందారు. హర్యానాలో 19.73 లక్షల మంది రైతులు మొదటి విడత లబ్ధి పొందగా, 11 విడత 11.59 లక్షల మంది రైతులు లబ్ధి పొందారు. మహారాష్ట్రలో లబ్ధిదారుల సంఖ్య 2019లో 1.09 కోట్ల మంది రైతుల నుంచి 2022 నాటికి 37.51 లక్షలకు భారీగా తగ్గింది. మధ్యప్రదేశ్‌లో 2019లో 88.63 లక్షల మంది లబ్ధిపొందగా, 2022లో 12,053 మంది రైతులు ఈ మొత్తాన్ని పొందారు. మేఘాలయలో మొదటి విడతలో 1.95 లక్షల మంది రైతులు పిఎంకిసాన్ పథకం నుంచి లబ్ధి పొందగా, 11వ విడతలో 627 మంది రైతులు లబ్ధి పొందారు. పంజాబ్‌లో మొదటి విడతలో 23.34 లక్షల మంది రైతులు లబ్ధి పొందితే, 11వ విడతలో 11.31 లక్షల మంది రైతులకు తగ్గిందని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

ఉత్తరప్రదేశ్‌లో 2019లో 2.6 కోట్ల మంది రైతులకు పిఎం కిసాన్ సాయం అందగా, 2022లో అది 1.26 కోట్లకు చేరింది. పశ్చిమ బెంగాల్‌లో 2019లో 45.63 లక్షల మంది రైతులకు పిఎం కిసాన్ సాయం అందగా, ఆరో విడత నుంచి ఒక్క రూపాయి కూడా రైతులకు అందలేదని డేటా స్పష్టం చేస్తోంది. అస్సాంలో మొదటి విడతలో 28.79 లక్షల మంది రైతులకు పిఎంకిసాన్ అందగా, 11వ విడతలో 2.54 లక్షల మంది రైతులకే అందింది. చండీగఢ్‌లో 2022 మే-జూన్‌లో కేవలం ముగ్గురికే ఈ మొత్తం అందింది. ఢిల్లీలో ఈ సంఖ్య 16,513 నుంచి 2,065కి తగ్గింది. హిమాచల్‌ప్రదేశ్‌లో 9.86 లక్షల నుంచి 5.43 లక్షలకు తగ్గింది. జమ్ముకాశ్మీర్‌లో లబ్ధిదారులు 12.07 లక్షల నుంచి 5.61 లక్షలకు తగ్గారు. జార్ఖండ్‌లో 11వ విడతలో 4.17 లక్షల మంది రైతులే అందుకున్నారు. మొదటి విడతలో 27.07 లక్షల మంది రైతులు అందుకున్నారు. కర్ణాటకలో ఈ సంఖ్య 55.61 లక్షల నుంచి 2.58 లక్షలకు తగ్గింది. కేరళలో 36.99 లక్షల మంది నుంచి 24.23 లక్షల మంది రైతులు తగ్గారు. ఒరిస్సాలో 39.20 లక్షల మంది రైతుల నుండి 7.05 లక్షల మందికి తగ్గారు. తమిళనాడులో 46.8 లక్షల లబ్ధిదారుల నుండి 23.04 లక్షల మందికి తగ్గారు. త్రిపురలోనూ సగానికి సగం తగ్గింది.

2019లో లోక్‌సభ ఎన్నికలకు ముందు పిఎంకిసాన్‌ను కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. అర్హులైన రైతు కుటుంబాలకు ఏడాదికి రూ.6,000 (మూడు విడతల్లో, విడతకి రూ.2000 చొప్పున) ఇవ్వనున్నారు. మొత్తం 12 విడతల్లో రూ.2.16 లక్షల కోట్లు రైతులకు అందజేశామని కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ తెలిపింది.

మోడీ ప్రభుత్వ తీరు దిగ్భ్రాంతికరం : ఎఐకెఎస్ నాయకులు అశోక్ ధావలే

ఈ గణాంకాలు చాలా దిగ్భ్రాంతికి గురిచేశాయని ఎఐకెఎస్ జాతీయ అధ్యక్షుడు అశోక్ ధావలే తెలిపారు. "2022లో ఈ డేటా ప్రకారం మూడొంతుల మంది రైతులకు చెల్లింపులు అందలేదు. లబ్ధిదారుల సంఖ్యలో ఇంత తగ్గుదలకు ఎటువంటి కారణం లేదు. ఈ పథకాన్ని కేంద్రం మెల్లమెల్లగా నీరుగార్చే ప్రయత్నం చేస్తోందని స్పష్టం. ఈ పథకం చట్టబద్ధంగా హామీ ఇవ్వబడిన ఎంఎస్‌పికి ప్రత్యామ్నాయం కాదు. రైతులు ఎదుర్కొంటున్న అసలైన సమస్యలను అధిగమించేందుకు ఎంఎస్‌పికి చట్టబద్ధత కల్పించాలి. ఈ పథకం జుమ్లా" అని ధావలే స్పష్టం చేశారు.

మంగళూరు బాంబు పేలుడు ఘటన
నిందితుడి నివాసంలో సోదాలు

బెంగళూరు : కర్ణాటకలోని మంగళూరులో శనివారం ఆటోలో బాంబు పేలిన ఘటనలో నిందితుడిని పోలీసులు గుర్తించారు. పేలుడులో గాయపడ్డ 24 ఏళ్ల మహమ్మద్ షరీఖ్ ఈ ఘటనకు బాధ్యుడని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. షరీఖ్ నివాసముంటున్న అద్దె ఇంటిలో పోలీసులు ఆదివారం సోదాలు నిర్వహించారు. తీర్థహల్లి గ్రామానికి చెందిన షరీఖ్ ఆటోలో ఇంప్రొవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైస్ (ఐఇడి)ను తీసుకుని వెళుతున్నప్పుడే పేలుడు జరిగిందని పోలీసులు చెప్పారు. సొంతవూరు నుంచి పారిపోయిన షరీఖ్ ప్రస్తుతం మైసూరుకు 13 కిలోమీటర్ల దూరంలోని మదహల్లి వద్ద అద్దె ఇంట్లో ఉంటున్నాడు. ఆ ఇంటిలో పోలీసులు ఆదివారం సోదాలు జరిపారు. మొబైల్ రిపేర్ ట్రైనింగ్ కోసం నగరానికి వచ్చినట్లు యజమానితో షరీఖ్ చెప్పినట్లు పోలీసులు గుర్తించారు. షరీఖ్ వద్ద దొరికిన ఆధార్ కార్డు, సిమ్ కార్డు నిందితుడివి కావని పోలీసులు నిర్ధారించారు. సిమ్ కార్డు తమిళనాడులోని కోయింబత్తూరులో తీసుకున్నట్లుగా ఉంది. ఆధార్ కార్డు కర్ణాటకకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. షరీఖ్ ప్రస్తుతం తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని, నిందితుడి వద్ద నుంచి వాంగూల్మం తీసుకోవడం ప్రస్తుతానికి సాధ్యం కాదని పోలీసులు చెప్పారు. మంగళూరు బాంబు పేలుడు ఘటన తీవ్రవాద చర్యనేని కర్ణాటక ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై ఆదివారం తెలిపారు. ఈ పేలుడుపై పూర్తి విచారణ జరుగుతుందని పేర్కొన్నారు.

జిఎం ఆవాలుపై సుప్రీంలో పిటిషన్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

జిఎం ఆవాల పేరుతో జన్యుపరంగా మార్పు చేసిన కొత్త రకాన్ని ఇటీవల కేంద్రప్రభుత్వం ప్రకటించింది. జిఎం ఆవాలను రైతు సంఘాలు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, రైతులు వ్యతిరేకిస్తున్నారు. జిఎం ఆవాల విడుదలపై మారటోరియం కోరుతూ పర్యవరణ కార్యకర్త అరుణా రోడ్రిగ్స్ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. జిఎం మస్టర్డ్ పర్యావరణ విడుదలపై తాత్కాలిక నిషేధించాలని కోరారు. ఇదే పిటిషన్‌కు తమ పిటిషన్ జత చేయాలని కోరుతూ జిఎం మస్టర్డ్‌కు మద్దతుగా షెత్కారీ సంఘటన పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌ను జస్టిస్ దినేష్ మహేశ్వరి నేతృత్వంలోని ధర్మాసనం ఈ నెల 17న రికార్డు చేసింది. తదుపరి విచారణ ఈ నెల 29కి వాయిదా పడింది. 2016, 2021లో జిఎం మస్టర్డ్‌తో సహా హెర్బిసైడ్ టాలరెంట్ (హెచ్‌టి) పంటల ఓపెన్ ఫీల్డ్ ట్రయల్స్, వాణిజ్యపరమైన విడుదలను వ్యతిరేకిస్తూ రోడ్రిగ్స్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ఈ నెల 3న సుప్రీం కోర్టు నియమించిన సాంకేతిక నిపుణుల కమిటీ (టిఇసి) అని హెచ్‌టి పంటలపై పూర్తి నిషేధాన్ని సిఫార్సు చేసింది.

జోడో యాత్రలో మేథాపాట్కర్

- కాంగ్రెస్‌పై మోడీ విమర్శలు

గాంధీనగర్ : రాహుల్ గాంధీ నేతృత్వంలో జరుగుతున్న భారత జోడో యాత్రలో ఉద్యమకారిణి మేథాపాట్కర్ పాల్గొనడంపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విమర్శలు సంధించారు. గుజరాత్‌లో అధిక భాగానికి నర్మదా డామ్ ప్రాజెక్టు తాగునీరు, సాగు నీరు అందిస్తుందని, ఇలాంటి ప్రాజెక్టును మేథాపాట్కర్ మూడు దశాబ్దాల పాటు అడ్డుకున్నారని గుర్తు చేశారు. జోడో యాత్రలో మేథాపాట్కర్ పాల్గొన్న తరువాత కాంగ్రెస్ గుజరాత్ ప్రజలను ఏ విధంగా ఓట్ల కోసం అడుగుతుందని మోడీ ప్రశ్నించారు. గుజరాత్‌లోని రాజ్‌కోట్ జిల్లా ధోరజీ పట్టణంలోని ఆదివారం మోడీ ఎన్నికల సభలో ప్రసంగించారు. మహారాష్ట్రలో శనివారం జరిగిన జోడో యాత్రలో రాహుల్‌గాంధీతోపాటు మేథాపాట్కర్ పాల్గొన్నారు.

ఏడుగురు బిజెపి నేతలపై వేటు

ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలుసహా ఏడుగురు బిజెపి నాయకులపై ఆదివారం ఆ పార్టీ వేటు వేసింది. త్వరలో జరిగే గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్లు వేశారనే కారణంగా ఏడుగురిని బిజెపి సస్పెండ్ చేసింది. ఈ విషయాన్ని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు సిఆర్ పాటిల్ వెల్లడించారు.

గుజరాత్‌లో డిసెంబర్ 1, 5వ తేదీల్లో రెండు దశల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. తొలి దశలో 89 స్థానాలకు జరిగే ఎన్నికలకు 788 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు.

21న రాజ్‌కోట్, సూరత్‌లో రాహుల్ బహిరంగ సభలు

ఈ నెల 21న రాజ్‌కోట్, సూరత్‌లలో జరిగే ఎన్నికల బహిరంగ సభల్లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ప్రసంగిస్తారని ఆ పార్టీ గుజరాత్ ఇన్‌ఛార్జి రఘుశర్మ తెలిపారు. అదేవిధంగా సూరత్‌లోని మధువలో ప్రజలను కలుస్తారని పేర్కొన్నారు. ఆదివారం రాహుల్‌గాంధీ జోడో యాత్ర మధ్యప్రదేశ్‌లో ప్రవేశించింది.

కేంద్ర దర్యాప్తు సంస్థల దుర్వినియోగం

- ఇడి, సిబిఐ, ఐటిలను కేంద్రం ఉసిగొల్పుతోంది
- సిపిఎం నేత బృందాకరత్

న్యూఢిల్లీ : కేంద్ర దర్యాప్తు సంస్థలను మోడీ ప్రభుత్వం దుర్వినియోగం చేస్తున్న తీరుపై సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బృందా కరత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం రాజ్యాంగ వ్యవస్థపై దాడికి పాల్పడుతోందని అన్నారు. ఆయా రాష్ట్రాల్లో బిజెపియేతర పార్టీలు అధికారంలో ఉన్న ప్రభుత్వాలపై కేంద్ర దర్యాప్తు సంస్థలైన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి), సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సిబిఐ), ఆదాయపు పన్ను (ఐటి) విభాగాలను కేంద్రం 'త్రిశూలం'లా ఉపయోగిస్తున్నదని విమర్శించారు. పార్టీ హెడ్‌క్వార్టర్స్‌లో మీడియా ప్రతినిధుల సమావేశంలో భాగంగా ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రతిపక్షాల నాయకులు బిజెపికి లొంగే వరకు ఈ 'త్రిశూల్'ను ఉపయోగిస్తారని ఆమె అన్నారు. జార్ఖండ్ సీఎం హేమంత్ సొరెన్ ఎదుర్కొంటున్నది ఒకరికి సంబంధించిన ప్రశ్న కాదనీ, ఇది ప్రజాస్వామ్య దేశంలో ప్రతిపక్ష రాజ్యాంగబద్ధ స్థానంపై దాడిగా అభివర్ణించారు. దీనిని ఖండిస్తున్నట్టు తెలిపారు. అక్రమ మైనింగ్ కేసులో హేమంత్ సొరెన్‌కు కేంద్ర దర్యాప్తు సంస్థ ఇడి నోటీసులు జారీ చేసి, విచారిస్తున్న విషయం తెలిసిందే. బిజెపియేతర ప్రభుత్వాలను అస్థిరపర్చటానికి తన ఎజెండాలో భాగంగా గవర్నర్ పదవిని కేంద్రం ఉపయోగించుకుంటున్నదని ఆమె విమర్శించారు. దేశంలో రాజ్యాంగాన్ని, సమాఖ్యస్ఫూర్తిని కాపాడటానికి ప్రస్తుతం అన్ని ప్రతిపక్ష పార్టీలు ఏకమై ప్రజల వద్దకు వెళ్లాలని సూచించారు.

చిరంజీవికి ఇండియన్ ఫిల్మ్ పర్సనాలిటీ పురస్కారం

గోవా : ప్రముఖ నటుడు చిరంజీవికి అరుదైన పురస్కారం లభించింది. సినీ పరిశ్రమకు చేసిన విశేష సేవలకుగానూ ఇండియన్ ఫిల్మ్ పర్సనాలిటీ 2022 అవార్డును చిరంజీవికి ఆదివారం ప్రకటించారు. గోవాలో జరిగిన ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వం ఈ అవార్డును ప్రకటించింది. భారతీయ సినిమా వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా 2013 నుంచి ఈ అవార్డును ప్రదానం చేస్తున్నారు. ఈ అవార్డు గ్రహీతకు నెమలి చిత్రం కలిగిన రజత పతకం, రూ.10 లక్షలు, ధ్రువీకరణ పత్రం అందజేస్తున్నారు. ఇప్పటి వరకూ ఈ అవార్డును వహీదా రెహమాన్, రజనీకాంత్, ఇళయరాజా, ఎస్‌పి బాలసుబ్రహ్మణ్యం, అమితాబ్ బచ్చన్, సలీమ్ ఖాన్, విశ్వజిత్ ఛటర్జీ, హేమమాలిని, ప్రసూన్ జోషి అందుకున్నారు.

గాయపడిన మహిళా న్యాయవాదికి లక్ష పరిహారం చెల్లించండి

- తమిళనాడు ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

చెన్నై : పోలీసులు నిందితుడిని పట్టుకునే క్రమంలో తీవ్రంగా గాయపడ్డ మహిళా న్యాయవాదికి లక్ష రూపాయల పరిహారం చెల్లించాలని తమిళనాడు ప్రభుత్వాన్ని మద్రాస్ హైకోర్టు ఆదేశించింది. ఈ పరిహారాన్ని పోలీసుల నుంచి వసూలు చేయవద్దని, ప్రభుత్వమే చెల్లించాలని హైకోర్టు స్పష్టం చేసింది. 2017 జులై 28న చెంగలపట్టు జిల్లా కోర్టు ఆవరణలో నిందితుడు వెంకటేశన్ పారిపోవడానికి ప్రయత్నించాడు. వెంకటేశన్‌ను పోలీసులు పట్టుకోవడానికి ప్రయత్నించినప్పుడు ఆ సమీపంలో ఉన్న న్యాయవాది ఎంఇవి తులసి తీవ్రంగా గాయపడ్డారు. నుదుటి నుంచి తీవ్ర రక్తస్రావం కావడంతోపాటు, మోకాలికి గాయమైంది. ఆమె వైద్యానికి రూ.3 లక్షలకుపైగా ఖర్చయ్యాయి. తనకు న్యాయం చేయాలని 2019లో తులసి రిట్ పిటీషన్ వేశారు. దీనిని విచారించిన న్యాయస్థానం ఈ కేసులో పోలీసుల్ని దోషులుగా చూడలేమని, నిందితుల్ని పట్టుకోవడం పోలీసుల విధి అని పేర్కొంది. ప్రభుత్వమే లక్ష రూపాయల పరిహారం అందించాలని తీర్పు చెప్పింది.

పరిహార నిధి కోసం ప్రపంచం ఎదురుచూస్తోంది

భారత్ ప్రకటన

న్యూఢిల్లీ : ఈజిప్టులో తాజాగా జరిగిన ఐక్యరాజ్యసమితి వాతావరణ సదస్సు 27లో పరిహార నిధి ఏర్పాటు చేయడానికి ఒప్పందం కుదరడంపై భారత్ హర్షం వ్యక్తం చేసింది. దీని కోసం సుదీర్ఘ కాలం నుంచి ప్రపంచం ఎదురుచూస్తుందని తెలిపింది. ఒప్పందం కుదరడాన్ని చారిత్రకంగా కేంద్ర పర్యావరణ మంత్రి భూపేంద్ర యాదవ్ వర్ణించారు. పరిహార నిధి ఏర్పాటు చేయడానికి ఏకాభిప్రాయాన్ని తీసుకొచ్చేందుకు అవిశ్రాంత ప్రయత్నం చేసిన ఈజిప్టు కృషిని మంత్రి అభినందించారు.

రాష్ట్రపతి ముర్ముకు కంటి ఆపరేషన్

న్యూఢిల్లీ : న్యూఢిల్లీలోని ఆర్మీ ఆసుపత్రిలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కుడి కంటికి ఆపరేషన్ ఈ నెల 16న విజయవంతంగా జరిగిందని రాష్ట్రపతి భవన్ ఒక ప్రకటనలో తెలిపింది. రాష్ట్రపతి మెజెస్టి క్యాటరాక్ట్‌తో బాధపడుతుండగా, బ్రిగేడియర్ ఎస్‌కె మిశ్రా బృందం విజయవంతంగా సర్జరీ చేసిందని పేర్కొంది. ప్రస్తుతం ఆమె ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయ్యారని, విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించారని తెలిపింది

అనంత్‌నాగ్‌లో ఎన్‌కౌంటర్.. టెర్రరిస్ట్ మృతి

శ్రీనగర్: అనంత్‌నాగ్‌లో భద్రతాబలగాలు, ఉగ్రవాదులకు మధ్య ఎదురుకాల్పులు ఆదివారం తెల్లవారు జామున ప్రారంభమయ్యాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో ఓ టెర్రరిస్టు మృతి చెందాడు. అనంత్‌నాగ్ జిల్లా బిజ్‌బేహార్ ప్రాంతంలో రహస్య స్థావరాలను గుర్తించడానికి భద్రత దళాలు, స్థానిక పోలీసులు సంయుక్తంగా గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో గాలింపు బృందాలపై టెర్రరిస్టులు కాల్పులకు పాల్పడ్డారు. ప్రతిగా జరిపిన ఎదురు కాల్పుల్లో ఓ హైబ్రిడ్ టెర్రరిస్ట్ చనిపోయాడని కాశ్మీర్ జోన్ పోలీసులు తెలిపారు. మృతుడిని లష్కరే తోయిబా ఉగ్రవాది సజ్జాన్ తంత్రేగా గుర్తించారు. ఈ నెల 13న బిబ్ బెహారాలోని రఖ్‌మోమెన్‌లో స్థానికేతర కూలీ హత్యకేసులో సజ్జాన్ ప్రమేయం ఉందని పోలీసులు చెప్పారు.

నేపాల్ ఎన్నికల్లో 60 శాతం పోలింగ్

- ఒకరి మృతి

ఖాట్మండు : నేపాల్ పార్లమెంటుకు, అసెంబ్లీలకు ఆదివారం జరిగిన ఎన్నికల్లో 60 శాతం పోలింగ్ జరిగింది. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన ఓటింగ్ సాయంత్రం 5 గంటల వరకూ జరిగింది. సుమారు 60 శాతం పోలింగ్ నమోదయిందని అధికారులు తెలిపారు. బజురా జిల్లాలో త్రిబెని మున్సిపాలిటీలోని నటేశ్వరి బాసిక్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్ వద్ద ఓటింగ్ ముగిసిన తరువాత అల్లర్లు చెలరేగాయి. అల్లర్లను చెదరగొట్టడానికి పోలీసులు జరిపిన కాల్పుల్లో 24 ఏళ్ల యువకుడు మృతి చెందారు. కైరలి జిల్లాలో ధనంగధి నగరంలోని ఒక పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్ వద్ద స్వల్ప పేలుడు సంభించింది. ఈ పేలుడుతో ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదు. ఓటింగ్‌కు సుమారు అరగంట సేపు అంతరాయం కలిగింది. దేశవ్యాప్తంగా 22 వేలకు పైగా పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ జరిగింది. మధ్యాహ్నం 2 గంటలకే 46 శాతం పోలింగ్ నమోదైనట్లు హోం శాఖ కార్యదర్శి వినోద్ ప్రకాశ్ సింగ్ తెలిపారు. ఈ ఎన్నికలతో నేపాల్‌లో రాజకీయ అస్థిరతకు ముగింపు లభిస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఆదివారం రాత్రి నుంచే ఓట్ల లెక్కింపు కొనసాగనుంది. నేపాల్ పార్లమెంట్‌లో మొత్తంగా 275 మంది సభ్యులు ఉన్నారు. వీరిలో 165 మంది ప్రత్యక్ష ఎన్నికల ద్వారాను, మిగిలిన 110 మంది దామాషా పద్ధతిన ఎన్నుకోబడతారు. ప్రత్యక్ష ఎన్నికల ఫలితాలను వచ్చే ఎనిమిది రోజుల్లోనూ, దామాషా ఎన్నికల ఫలితాలను డిసెంబరు 8లోగానూ ప్రకటిస్తామని నేపాల్ ఎన్నికల ప్రధాన కమిషనర్ దినేష్ కుమార్ తపలియా చెప్పారు.

పుణేలో ట్యాంకర్ బీభత్సం

- 48 వాహనాలు ధ్వంసం
- 30 మందికి గాయాలు

ముంబయి : మహారాష్ట్రలోని పుణేలో ఆదివారం రాత్రి 9 గంటల సమయంలో ఒక ట్యాంకర్ బీభత్సం సృష్టించింది. నగరంలోని నవలే వంతనపై వాహనాలపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో 48కి పైగా వాహనాలు ధ్వంసం కాగా, 30 మంది గాయపడ్డారు. పుణే అగ్నిమాపక సిబ్బంది, పుణే మెట్రోపాలిటన్ రీజన్ డెవలప్‌మెంట్ అథారిటీ (పిఎంఆర్‌డిఎ) సిబ్బంది ప్రమాదవార్త తెలిసినవెంటనే అక్కడకు చేరుకుని సహాయక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ట్యాంకర్ బ్రేకులు ఫెయిల్ కావడంతోనే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు.

బహ్రెయిన్ పార్లమెంట్‌లో పెరిగిన మహిళా ప్రాతినిధ్యం

మనామా : బహ్రెయిన్ పార్లమెంట్‌లో మహిళా ఎంపిల ప్రాతినిధ్యం రికార్డు స్థాయిలో పెరిగింది. ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో రికార్డు స్థాయిలో ఎనిమిది మంది మహిళా ఎంపిలు ఎన్నికయ్యారు. వీరిలో ఎక్కువమంది మొదటిసారి ఎంపిలుగా ఎన్నికైన వారే. బహ్రెయిన్ పార్లమెంట్‌లో 40 ఎంపి స్థానాలున్నాయి. వీటి కోసం 73 మంది మహిళలుసహా 330 మంది అభ్యర్థులు ఎన్నికల్లో పోటీపడ్డారు. రెండు ప్రధాన ప్రతిపక్ష పార్టీలు ప్రస్తుత ఎన్నికలకు అభ్యర్థులను ప్రకటించలేదు. ఈ నెల 12న తొలి దశ ఎన్నికల జరిగాయి. తొలి దశలో ఫలితాలు రాకపోవడంతో ఈ నెల 19న రెండో దశ ఎన్నికలు జరిగాయి. ఆ రాత్రి నుంచి ఫలితాలను వెల్లడిస్తున్నారు. ఆదివారం వరకూ 34 మంది విజేతలు పేర్లు ప్రకటించారు.

బహ్రెయిన్ ఎన్నికలపై విమర్శలు

బహ్రెయిన్‌లో ఎన్నికలపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాజకీయ అణచివేత వాతావరణం'లో ఎన్నికలు జరుగుతున్నాయని అమ్నెస్టీ తదితర సంస్థలు విమర్శిస్తున్నాయి. బహ్రెయిన్‌లో పార్లమెంట్ ఎన్నికలు జరగడం ఇది మూడోసారి. అనేక ఉద్యమాల తరువాత 2011 నుంచి బహ్రెయిన్‌లో ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ దేశంలో జనాభా సుమారు కోటీ 40 నలభై లక్షల మంది ఉన్నా... నమోదైన ఓటర్లు దాదాపు నాలుగు లక్షల మందే.

మెహ్రౌలీ అడవిలో శ్రద్ధ వాకర్ పుర్రె, ఎముకలు లభ్యం

ఢిల్లీ: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన శ్రద్ధా వాకర్ హత్య కేసు విచారణను పోలీసులు అత్యంత వేగంగా పూర్తి చేస్తున్నారు. దర్యాప్తులో భాగంగా మెహ్రౌలీ అడవిలో శ్రద్ధ శరీర భాగాల కోసం ముమ్మరంగా గాలించారు. ఇటీవల కొన్ని అవశేషాలను సేకరించిన ఢిల్లీ పోలీసులు మెహ్రౌలీ అడవుల్లో మరిన్ని మానవ అవశేషాలను స్వాధీనం చేసుకున్నారు. అడవిని గాలించేందుకు నిందితుడు అఫ్తాబ్‌ను కూడా తీసుకెళ్లారు అతడు చెప్పిన వివరాల ప్రకారం అడవినంతా వెతికి పోలీసులు ప్రాథమికంగా 8 నుండి 10 ఎముకలను స్వాధీనం చేసుకున్నారు. వాటిని ఫోరెన్సిక్ పరీక్షకు పంపారు. ఇవి కచ్చితంగా శ్రద్ధవే అయి ఉంటాయని చెబుతున్నారు. పుర్రెలో సగభాగం, శిరచ్ఛేదం చేయబడిన దవడ, మరిన్ని ఎముకలు ఆదివారం లభించాయి.



సిరియాపై టర్కీ వైమానిక దాడులు

31 మంది మృతి

డమాస్కస్ : సిరియాలోని ప్రధాన పట్టణాలపై శనివారం టర్కీ వైమానిక దాడులతో విరుచుకుపడింది. ఈ దాడుల్లో 31 మంది మృతి చెందారు. పదుల సంఖ్యలో గాయపడ్డారు. ప్రధానంగా ఉత్తర సిరియాలోని రాఖా, హస్సకెహ, అలెప్పో రాష్ట్రాలపై టర్కీ దాడులు జరిపింది. సుమారు 25 వైమానిక దాడులకు టర్కీ పాల్పడింది. గత వారం ఇస్తాంబుల్‌లో జరిగిన బాంబు దాడికి ప్రతిస్పందనగానే టర్కీ ఈ వైమానిక దాడులకు పాల్పడినట్లు సమాచారం. సిరియా కుర్దిష్ దళాలే లక్ష్యంగా దాడులు చేసింది. దాడులు చేసిన విషయాన్ని టర్కీ రక్షణ శాఖ తన సోషల్ మీడియా ఖాతా ద్వారా నిర్ధారించింది.

సిక్కులు కిర్పాన్ ధరించవచ్చు..

- అమెరికా ప్రభుత్వం అనుమతి

అమెరికా: అమెరికాలోని విద్యాసంస్థల్లో చదువుతున్న సిక్కు విద్యార్థులు కాలేజీలో కిర్పాన్‌ను ధరించేందుకు అమెరికా ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. అమెరికా విద్యావిధానంలో తీసుకొచ్చిన మార్పుల మేరకు సిక్కులకు కిర్పాన్ ధరించే వెసులుబాటును కల్పించింది. రెండు నెలల క్రితం కిర్పాన్ ధరించి కాలేజీకి వచ్చిన విద్యార్థినొకరిని అక్కడి పోలీసులు అరెస్ట్ చేశారు. దాంతో విద్యావిధానంపై ప్రభుత్వం సమీక్ష జరిపింది. ఈ ఘటన నేపథ్యంలో యూనివర్సిటీ పాలసీలో మార్పులు తీసుకొచ్చారు. ఈ పాలసీ ప్రకారం కిర్పాన్ పొడవు 3 అంగుళాల కంటే తక్కువగా ఉండాలి. సిక్కు కూటమి, గ్లోబల్ సిక్కు కౌన్సిల్‌తో పాటు పలువురు సిక్కు నాయకులతో చర్చించిన మీదట పాత విధానానికి మార్పులు చేసినట్లు అమెరికా విద్యాశాఖ అధికారులు వెల్లడించారు. అమెరికాలో వెపన్స్ ఆన్ క్యాంపస్ పాలసీని అమలుచేస్తున్నారు. ఇటీవల జరిగిన సంఘటన నేపథ్యంలో ఈ పాలసీపై సమీక్ష జరిపిన అధికారులు అప్‌డేట్ చేసేందుకు సుముఖత వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం మేరకు అమెరికాలోని విద్యాసంస్థల్లో సిక్కు విద్యార్థులు కిర్పాన్‌ను ధరించేందుకు వీలు కలుగుతున్నది. గత సెప్టెంబర్‌లో ఓ సిక్కు విద్యార్థి కిర్పాన్ ధరించి నార్త్ కరోలినా విశ్వవిద్యాలయానికి వచ్చాడు. కిర్పాన్‌ను తీసేయాలని అక్కడి అధికారులు చేసిన సూచనను ఆ విద్యార్థి పాటించకపోవడంతో.. సదరు విద్యార్థిని పోలీసులు అరెస్ట్ చేశారు.

అమెరికా నైట్‌క్లబ్‌లో కాల్పులు..

ఐదుగురు మృతి



వాషింగ్టన్ : అమెరికాలోని కొలరాడోలో గల గే నైట్‌క్లబ్‌లో శనివారం రాత్రి జరిగిన కాల్పుల్లో ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. మరో 18 మంది గాయపడ్డారు. శనివారం అర్ధరాత్రి 11.57 గంటలకు ఓ సాయుధుడు విచక్షణారహితంగా కాల్పులు జరపడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆ తర్వాత కాల్పులు జరిపిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. కాల్పులకు కారణాలు తెలియరాలేదు. ట్రాన్స్‌ఫోబియా కారణంగా హత్యకు గురైన వారి జ్ఞాపకార్థం ఏటా నిర్వహించే 'ట్రాన్స్‌జెండర్ డే ఆఫ్ రిమెంబరెన్స్' శనివారం నిర్వహిస్తుండగా, కాల్పులు చోటు చేసుకున్నాయి.

మీ కోసం

ఫ్రిజ్‌లో పండ్లను భద్రపరిచేటప్పుడు పేపరు వేసి సర్దుకుంటే ఎక్కువ రోజులు తాజాగా ఉంటాయి.

జీవన సౌరభం

మిమ్మల్ని బలవంతులుగా చేసే ప్రతి ఆశయాన్ని స్వీకరించండి. బలహీనపరిచే ప్రతి ఆలోచననూ తిరస్కరించండి.

పిల్లల సందడి

హేతు పాప వచ్చింది
బొమ్మలు ఎన్నో తెచ్చింది
ఆటలు చక్కగా ఆడింది
గేయాలన్నీ చెప్పింది

పూజిత్ బాబు వచ్చాడు
పలకా బలపం తెచ్చాడు
అంకెలు చక చక రాశాడు
కబుర్లు ఎన్నో చెప్పాడు

జైతు పాప వచ్చింది
నాట్యం చక్కగా చేసింది
పద్యాలన్నీ పాడింది
చక్కగ కిలకిల నవ్వింది

అక్షయ బాబు వచ్చాడు
గుణింతాలు చెప్పాడు
ఇంగ్లీష్ రైమ్స్ పాడాడు
చక చక పరుగులు పెట్టాడు

పునీత్ బాబు వచ్చాడు
చరవాణి చక్కగ అడిగాడు
మీటలన్నీ నొక్కాడు
గేయాలెన్నో చూశాడు!

- మొర్రి గోపి
88978 82202

దారి చూపండి

చిన్నారులూ, ఒక గేదె దారి తప్పిపోయింది. మందలో కలిసేలా దానికి దారి చూపి సాయం చేయరూ!



నేను గీసిన బొమ్మ

- వాట్సవ్,
3వ తరగతి,
కేంద్రీయ విద్యాలయ స్కూలు,
కందుకూరు.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ప్రజల వాడుకలోకి విశిష్ట గ్రంథాలయం



నూటొక్క ఏళ్ల చరిత్ర గల గ్రంథాలయం అది. వివిధ అంతస్తుల్లో లక్షల కొలది పుస్తకాలతో కొలువై ఉన్న పుస్తకాలయం. దేశ స్వాతంత్ర్యానికి 26 ఏళ్ల క్రితమే స్థాపించబడింది. కేరళ రాష్ట్రం ఏర్పడడానికి చాలా కాలం ముందు ట్రావెన్‌కోర్ సంస్థానంలో ప్రారంభించబడిన సుదీర్ఘ చరిత్ర గల ఈ గ్రంథాలయం ఒకప్పుడు కేవలం చట్టసభల వ్యక్తులకే పరిమితమై ఉండేది. కాని ఇప్పుడు అంటే 2022 నవంబరు 1 నుంచి సామాన్య ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. శతాబ్ది ఉత్సవాలు జరుపుకున్న ఏడాది తరువాత కేరళ పిరవి దినోత్సవ సందర్భంగా ఈ గ్రంథాలయం తలుపులు ప్రజల కోసం తెరుచుకున్నాయి.

1921లో స్థాపించిన ఈ గ్రంథాలయాన్ని మొట్టమొదట శాసన గ్రంథాలయంగా పిలిచేవారు. ఆ తరువాత 1949లో ట్రావెన్‌కోర్ కొచ్చిన్ అసెంబ్లీగా పిలిచారు. ప్రస్తుతం 1956 నుంచి ప్రచారంలో ఉన్న కేరళ శాసన సభ గ్రంథాలయంగా పిలుస్తున్నారు. ప్రజలకు మరింత చేరువ చేసేందుకు నవంబరు 28 నుంచి డిసెంబరు 4 వరకు అంతర్జాతీయ పుస్తక మహోత్సవం నిర్వహించేందుకు గ్రంథాలయ సిబ్బంది నడుం బిగించారు.

ఎన్నో పత్రికలు, పుస్తకాలు

గ్రంథాలయ విశిష్టత గురించి చెబుతూ 'ఇది ఒక ప్రత్యేకమైన జ్ఞాన భాండాగారం' అంటారు డిప్యూటీ లైబ్రేరియన్ ఇందు. ఇక్కడ లక్షా పదివేల పుస్తకాలు వివిధ అంతస్తుల్లో నిక్షిప్తమై ఉన్నాయి. ఇంగ్లీషు, మలయాళ భాషల్లో సుమారు 150 పత్రికల కాపీలు, 20 వార్తా పత్రికల ఏడాది సంచికలు ఉన్నాయి. ఇంతటి జ్ఞాన నిధిని పదిలంగా కాపాడుకునే భాగంగా ఈ గ్రంథాలను డిజిటలైజ్ చేస్తున్నారు. ఆ కాపీలను niyamasabha.org ద్వారా ప్రజలకు అందుబాటులో ఉంచారు. '1888 నాటి అసెంబ్లీ ప్రొసీడింగ్స్ చాలా వరకు బయటే ఉండిపోయాయి. వాటిలో దాదాపు 75 ప్రతులను వాటి అసలు రూపం చెక్కుచెదరకుండా భద్రపరచగలిగాం. ఇంకా అనేక పత్రాల్లో స్వాతంత్ర్యం రాకపూర్వం చేసిన రాజుల ప్రకటనలు, పరిపాలనా నివేదికలు, కేరళ రాష్ట్రం ఏర్పడడానికి ముందు డైరక్టరీలు ఉన్నాయి' అంటూ గ్రంథాలయ ప్రాశస్త్యం వివరిస్తారు ఇందు.

వివిధ అంతస్తుల్లో ఉన్న ఈ లైబ్రరీలో గ్రౌండ్ ఫ్లోర్ రిఫరెన్స్ సెక్షన్ నుండి ఆరు విభాగాలు ఉన్నాయి. 19వ శతాబ్దం చివరి నాటి కమిటీ కమిషన్ నివేదికలు, సెంట్రల్ కమిటీ నివేదికలు దిగువ అంతస్తులో భద్రపరిచారు. గ్రంథాలయ వాతావరణాన్ని ఏమాత్రం దెబ్బతీయకుండా డిజిటలైజేషన్ ప్రక్రియ కొనసాగించడం ప్రత్యేకంగా చెప్పుకోవాలి. ఏళ్లతరబడి భద్రపరిచిన అరుదైన పత్రాలను ప్రజలకు అందుబాటులో ఉంచలేకపోయినా జీవితచరిత్రలు, సాహిత్యం, న్యాయపత్రికలు వంటి వాటిని సాధారణ విభాగం నుంచి సేకరించుకునే వీలు కల్పించారు.



అద్భుత సేకరణల నిధి

ఇందులో నిక్షిప్తమైన గ్రంథాల్లో నేషనల్ జాగ్రఫిక్, ఇపిడబ్ల్యు మ్యాగజైన్‌లు వంటివి 1940 నుంచి 1960ల నాటివి. కేరళ ప్రభుత్వం ఏర్పడిన మొదటి సంవత్సరంలో ప్రచురించబడిన మాతృభూమి వారపత్రిక, పాత ఫొటోలు, సినిమా పోస్టర్లు, అనేక ఇతర రచనలు ఇక్కడ ఉన్న అద్భుత సేకరణలు. 1924 నుంచి వార్తాపత్రికల సేకరణ కూడా ఇందులో నిక్షిప్తం చేశారు. ట్రావెన్‌కోర్, కొచ్చిన్ రాచరిక దశల్లో రెండు విడివిడి రాష్ట్రాలుగా ఉనికిలో ఉన్న కేరళ మ్యాప్‌లు కూడా ఇక్కడ చూడవచ్చు. 1895 నుంచి రాష్ట్రాల వ్యక్తిగత చట్టాలు, ప్రకటనలు, సావనీర్ సేకరణలు, రాజ్యాంగం వంటివన్నీ ఈ గ్రంథాలయ గర్వించదగ్గ సేకరణలుగా ఉన్నాయి.

రేగుపండ్లు ఎంతో మేలు

చలికాలంలో దొరికే పండ్లలో రేగుపండ్లు ఇప్పుడు విరివిగా దొరుకుతున్నాయి. వీటిని తినడం వలన చాలా ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. శరీరానికి చక్కటి పోషకాలు అందించడంలో ఈ పండ్లు బాగా ఉపయోగపడతాయి.



❖ వీటిలో ఉండే మినరల్స్ గుండె ఆరోగ్యంగా చాలా మేలు చేస్తాయి.

❖ రక్తంలో హిమోగ్లోబిన్ పెరగాలంటే ఐరన్ అవసరముంటుంది. ఈ పండ్లను తినడం వలన రక్త హీనత సమస్య తగ్గుతుంది. రక్త ప్రసరణ సాఫీగా జరగడానికి కూడా ఉపయోగపడతాయి.

❖ ఎముకలు దృఢంగా వుండేందుకు అవసరమైన కాల్షియం, పాస్ఫరస్ ఎండిన రేగు పండ్లలో పుష్కలంగా లభిస్తాయి.

❖ ఆర్థరైటిస్ సమస్యతో బాధ పడేవారు ఈ పండ్లు తినడం వలన మంచి ప్రయోజనం ఉంటుంది.

❖ కీళ్లకి సంబంధించిన సమస్యలు ఉన్నవారు ఈ పండ్లు తింటే చాలా మంచిది.

❖ మల బద్ధకం ఉన్నవారికి రేగిపండు తినడం చాలా మంచిది.

❖ ఇవి ఎన్ని తిన్నా బరువు పెరగరు. కొవ్వు ఉండదు, ఇందులో ఉండే కేలరీలు చాలా తక్కువ.. శరీరానికి వెంటనే శక్తి వస్తుంది.

❖ శరీరానికి అవసరమైన 24 రకాల ఆమైనో ఆమ్లాలలో 18 రకాలు ఒక్క రేగు పండ్లలోనే లభిస్తాయి. వీటితో కడుపుమంట, అజీర్తి, గొంతునొప్పి, అస్తమా, కండరాల నొప్పి తగ్గుతాయి.

❖ గర్భిణీల్లో ఉండే వికారాలను వాంతులను తగ్గిస్తుంది.

❖ మూత్రపిండాలు, ముఖ్యంగా ఊపిరితిత్తుల్లో పేరుకుపోయిన కఫాన్ని బయటకి పంపి ఆరోగ్యంగా ఉండేందుకు దోహదపడుతుంది.

చలికాలం పిల్లల రక్షణ ఇలా..

చలికాలంలో పిల్లల నుంచి పెద్దల వరకూ అందరికీ అనారోగ్య సమస్యలు వస్తూనే ఉంటాయి. ప్రధానంగా ఈ సీజన్‌లో వైరస్‌ల వ్యాప్తి ఎక్కువగా ఉంటుంది. దగ్గు, జలుబు, జ్వరం వంటి అనేక అనారోగ్యాలు వస్తుంటాయి. రోగనిరోధక శక్తి తక్కువగా ఉండే పిల్లల ఆరోగ్యంపై ఈ కాలంలో ప్రత్యేక శ్రద్ధ అవసరం.

డ్రెస్ : సీజన్ మారినప్పుడు వాతావరణంలో వచ్చే మార్పులు పిల్లలకు ఇబ్బంది కలిగిస్తాయి. పిల్లల ముఖం, శరీరంపై సూక్ష్మక్రిములు దాడి చేస్తాయి. అందువల్ల పిల్లలకు డ్రెస్ విషయంలో ఎక్కువ జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖం, శరీరం మొత్తం కప్పి ఉంచే డ్రెస్ వెయ్యాలి. చలి తగలకుండా.. వెచ్చదనం ఉండేలా చెయ్యాలి. ఫుల్ స్లీవ్స్, మంకీ క్యాప్స్, ఫుల్ లెంగ్త్ పాంట్స్ వాడాలి.

పరిశుభ్రత : పిల్లల గది, ఆడుకునే ప్రదేశాలు, చదువుకునే ప్రదేశం అన్నీ పరిశుభ్రంగా ఉండేలా చూడాలి. పిల్లలు ఎక్కువగా ఇండోర్స్ లోనే ఉంటారు కాబట్టి.. ప్రతి రోజూ ఇల్లు పరిశుభ్రంగా ఉంచాలి. పిల్లలకు వాడే బట్టలు, సాక్స్, స్కూల్ బ్యాగ్స్, బొమ్మలు అన్నీ పొడిగా, శుభ్రంగా ఉండాలి.

సరైన ఆహారం : పిల్లలకు ఏడాదంతా పౌష్టికాహారం అందించడం అత్యవసరం. తినే ఆహారంపైనే వారి ఇమ్యూనిటీ ఆధారపడి ఉంటుంది. అందువల్ల వ్యాధి నిరోధక శక్తిని పెంచే ఆహారం ఎక్కువగా ఇవ్వాలి. పాలు, పండ్లు, గుడ్లు, కూరగాయలు, ఆకు కూరలను ఎక్కువగా ఇవ్వాలి.

నీరు : చలికాలంలో చర్మం త్వరగా పొడిబారిపోతుంది. అందువల్ల పిల్లలతో నీరు బాగా తాగిస్తూ ఉండాలి. నీరు చర్మాన్ని తేమగా ఉంచి.. బ్యాక్టీరియాతో పోరాడేలా చేస్తుంది. నీటి వల్ల శరీరం.. విష వ్యర్థాలను బయటకు పంపేందుకు వీలవుతుంది.

నిద్ర : చలికాలంలో పిల్లలు బాగా నిద్రపోయేలా చెయ్యాలి. తద్వారా వారి ఇమ్యూనిటీ బాగా పెరుగుతుంది. శారీరకంగా కూడా పిల్లలు ఎదిగేందుకు నిద్ర చాలా అవసరం. రోజూ కనీసం 7 గంటలైనా పడుకునేలా చెయ్యండి.

వినోదం.. విజ్ఞానం.. వికాసం.. విప్లవం వంటి సగటు మనిషి ఆలోచనలకు చైతన్యబీజాలు వేసిన చరిత్ర మన తెలుగు సినిమాది. కాయకష్టం చేసుకునే బడుగు జీవుల నుండి కారులో షికారు చేసే కుర్రకారు వరకు కాసింత వెసులుబాటు ఇచ్చిన ఏకైక మాధ్యమంగా వర్ధిల్లింది. పల్లె నుంచి పట్నం వరకు అందరినీ ఒక్కతాటిపై నడిపించిన చరిత్ర గలది. పోరాటాలకు, ప్రతిఘటనలకు నిలువెత్తు ఆలంబనగా నిలిచిన గొప్ప దూరదృష్టి గలది. ఇంతటి ఘన చరిత్రలో ఎందరో మహానుభావులు.. తమకంటూ ప్రత్యేక ముద్రవేసుకున్న ఆ తరం నటీనటులంతా ఇప్పుడు మనమధ్య లేకపోయినా చిత్రరంగానికి వారు అందించిన సేవలు అజరామరం.

కొనసాగించదగ్గ వారసత్వం

చరిత్రకు శ్రీకారం..

తొలినాళ్లల్లో సినిమాల్లో నటించేవారు, తీసేవారు, నిర్మించేవారంతా రంగస్థల కళాకారులే ఉండేవారు. సినిమా అంటే వినోదం మాత్రమే కాదు విప్లవం సృష్టించేదిగా కూడా ఉండగలదని ఆ కళాకారులు నిరూపించారు. పురాణ గాథలే ఇతివృత్తాలుగా వస్తున్న ఒరవడికి భిన్నంగా గూడవల్లి రామబ్రహ్మం 'మాలపల్లి' చిత్రం కొత్త ప్రభంజనం సృష్టించింది. జమిందారీ విధానాలను ఎదిరించడం, రైతు సమస్యలను ప్రజల ముందుంచడంలో అప్పటి చలనచిత్రాలు ముందువరుసలో నిలిచేవి. జమిందారీ విధానాన్ని వ్యతిరేకిస్తూ తెరకెక్కిన 'మాలపల్లి' చిత్రంపై అప్పట్లో నిషేధాజ్ఞలు కూడా అమలయ్యాయి.

సంఘంలో జరిగే అనేక దురాచారాలపై తెరకెక్కిన ఆనాటి చిత్రాలు ప్రజా జీవనాలపై విశేష ప్రభావం చూపాయనడంలో సందేహం లేదు.

ప్రజానాట్యమండలి నుంచి ...

నటనకు ప్రత్యేక శిక్షణా తరగతులేమీ లేని రోజులవి. రంగస్థలమే కళాకారుల పుట్టిల్లుగా వర్ధిల్లుతున్న కాలం. తెలుగుతెరపై మెరిసిన ఆనాటి నటీనటులంతా రంగస్థల కళాకారులే. దర్శకుడు రాజారావు 'పుట్టిల్లు' చిత్రం ద్వారా ఎంతోమంది రంగస్థల కళాకారులను చిత్రసీమకు పరిచయం చేశారు. నాగేశ్వరరావు, కృష్ణ, ఎస్‌వి రంగారావు, అల్లు రామలింగయ్య, రాజనాల, ప్రభాకరరెడ్డి తదితరులు, దర్శకుల్లో ఆదుర్తిసుబ్బారావు, వేదాంతం రాఘవయ్య, తాతినేని ప్రకాశరావు, తాపీ చాణక్య, యోగానంద్ తదితరులంతా రంగస్థలం నుంచి వచ్చినవారే.

ఎన్నో వైవిధ్యాలు, మరెన్నో ప్రయోగాలతో కళారంగానికి సేవచేసిన ఈ కళాకారులు తెలుగు సినిమా స్థాయిని పెంచడంలో అవిశ్రాంతంగా పాటుపడ్డారు. 1957లో విజయ సంస్థ వారు నిర్మించిన 'మాయా బజార్' చిత్రం ఓ దృశ్య కావ్యం. నటులే దర్శకులుగా, నిర్మాతలుగా మారిపోయి సినిమా తీసిన చరిత్ర ఉంది. ఎన్‌టిఆర్ స్వయంగా దర్శకత్వం వహించి మూడు పాత్రల్లో నటించిన 'దాన వీర శూర కర్ణ' అప్పట్లో పెద్ద సంచలనం. ఏకంగా తొమ్మిది పాత్రల్లో 'నవరాత్రి' సినిమాలో అక్కినేని నటించారు. జానపద చిత్రాల్లో తన మార్కు నటనకు కాంతారావు నిలిచిపోయేవారు. గంభీర స్వరంతో తెలుగు తెరకు నిండుతనం తెచ్చిన నటుల్లో ఎస్‌వి రంగారావుది అగ్రస్థానం. ఇంకా రాజబాబు, రేలంగి, రమణారెడ్డి, సూర్యకాంతం, గీతాంజలి, గిరిజ తదితరులు స్వచ్ఛమైన హాస్యానికి మారుపేరుగా నిలుస్తారు. మూడోతరం నటులుగా శోభన్‌బాబు, కృష్ణ, కృష్ణంరాజు తదితరులు సాంఘికచిత్రాలు, ప్రయోగాత్మక చిత్రాలతో పాటు కొత్త సాంకేతికతను చిత్రరంగానికి పరిచయం చేశారు.

నిబద్ధతతో..

అప్పటి నటులంతా కళారంగానికి సేవ అందించడంలో ఎంతో నియమ నిబద్ధతలతో వ్యవహరించేవారు. నిర్మాతలకు నష్టం వస్తుందంటే పారితోషికాలు తగ్గించుకోవడం, సినిమా ప్రచారంలో ముందుండి నడిపించడం, ముఖ్యంగా తక్కువ సమయంలో సినిమా పూర్తయ్యేలా చూడడంలో రాత్రి పగలు తేడా లేకుండా కష్టపడేవారు. ఒక్కొక్క నటులు ఏడాదికి పదికి పైగా చిత్రాలు చేసేవారంటేనే ఎంతటి సమయపాలన పాటించేవారో అర్థమౌతుంది.

ఎన్‌టి రామారావు (400), నాగేశ్వరరావు (256), శోభనబాబు (300 పైగా), కృష్ణంరాజు (188), కృష్ణ (350 పైగా), ఎస్‌వి రంగారావు (దాదాపు 150), రాజబాబు (దాదాపు 100), అల్లు రామలింగయ్య (1000కి పైగా) ... ఇలా అప్పటి నటీనటుల్లో క్యారెక్టర్ ఆర్టిస్టులే కాక హీరోలు కూడా వందల్లో సినిమాలు చేసేవారు. కాని ఇప్పుడు వారి రెండోతరం, మూడోతరం వారసులుగా ఇండస్ట్రీలోకి వచ్చిన నటులెవ్వరూ వంద సినిమాలకు దరిదాపుల్లో కూడా ఉండడం లేదు.

ఈ తరం నటుల్లో చిరంజీవి మాత్రమే 150 చిత్రాల మార్కును అందుకున్నారు. కృష్ణ వారసుడిగా మహేష్, కృష్ణంరాజు వారసుడిగా ప్రభాస్, చిరంజీవి వారసులుగా పవన్ కళ్యాణ్, రామ్ చరణ్, అల్లు అర్జున్, నాగేశ్వర రావు వారసులుగా నాగార్జున, నాగచైతన్య, అఖిల్ తదితర ఈ తరం నటులు కనీసం 50 సినిమాల దరిదాపుల్లో కూడా లేరు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో.. వందల కోట్ల రూపాయల బడ్జెట్‌తో.. దేశవిదేశాల్లో చిత్ర నిర్మాణమే తెలుగు సినిమా చరిత్రగా ఇప్పటి తరం భావిస్తోంది. కానీ తెలుగు సినిమా గత చరిత్ర ఎన్నో ప్రయోగాలకు, సామాజిక ప్రయోజనాలకు వేదికగా నిలిచింది. ఆ వారసత్వం కొనసాగించదగింది.

సూర్య ప్రతాపం

అజేయ శతకంతో చెలరేగిన సూర్య
కివీస్‌పై భారత్ ఘన విజయం

మిస్టర్ 360 మరో మెరుపు ఇన్నింగ్స్‌తో చెలరేగాడు. తనదైన మార్క్ షాట్లతో కివీస్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. అజేయ శతకంతో కదం తొక్కిన సూర్యకుమార్ యాదవ్ రెండో టీ20లో భారత్‌కు ఘన విజయాన్ని అందించాడు. సూర్య ప్రతాపంతో తొలుత భారత్ 191 పరుగుల భారీ స్కోరు చేయగా.. ఛేదనలో న్యూజిలాండ్ 126 పరుగులకే కుప్పకూలింది. 65 పరుగుల తేడాతో గెలుపొందిన భారత్ టీ20 సిరీస్‌లో 1-0 ఆధిక్యం సాధించింది.

మౌంట్ మౌంగానుయ్ : భారత్ ఘన విజయం. 65 పరుగుల తేడాతో న్యూజిలాండ్‌పై ఏకపక్ష విజయం. సూర్యకుమార్ యాదవ్ (111 నాటౌట్, 51 బంతుల్లో 11 ఫోర్లు, 7 సిక్స్‌లు) అజేయ శతకంతో చెలరేగాడు. తనకే సాధ్యమైన విలక్షణ షాట్లతో న్యూజిలాండ్ బౌలర్లపై విశ్వరూపం చూపించాడు. సూర్యకుమార్ యాదవ్ శతక షోకు ఇషాన్ కిషన్ (36, 31 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్) సైతం రాణించటంతో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 191 పరుగులు చేసింది. ఛేదనలో న్యూజిలాండ్ చేతులెత్తేసింది. కెప్టెన్ కేన్ విలియమ్సన్ (61, 52 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్థ సెంచరీ సాధించినా మ్యాచ్ పరిస్థితులకు అనుగుణంగా రాణించలేదు. దీపక్ హుడా (4/10), సిరాజ్ (2/24), చాహల్ (2/26) వికెట్ల వేటలో జోరందుకోగా.. 18.5 ఓవర్లలో 126 పరుగులకే న్యూజిలాండ్ కుప్పకూలింది. సూర్యకుమార్ యాదవ్ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకున్నాడు. మూడు మ్యాచుల టీ20 సిరీస్‌లో తొలి మ్యాచ్ వర్షార్పణం కాగా.. చివరి మ్యాచ్ మంగళవారం నేపియర్‌లో జరుగనుంది.

సూర్య శతక జోరు : టాస్ నెగ్గిన న్యూజిలాండ్ తొలుత భారత్‌కు బ్యాటింగ్ అప్పగించింది. ఇషాన్ కిషన్ (36, 31 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్)కు తోడు రిషబ్ పంత్ (6, 13 బంతుల్లో 1 ఫోర్) ఓపెనర్‌గా వచ్చాడు. బౌండరీతో మొదలుపెట్టిన పంత్ దూకుడు కొనసాగించలేకపోయాడు. ఇషాన్ కిషన్ వరుస బౌండరీలతో కదం తొక్కాడు. పవర్‌ప్లేలో కివీస్ బౌలర్లపై ఎదురుదాడి చేశాడు. తడబడిన పంత్ వికెట్ల వెనకాల సౌథీ మెరుపు క్యాచ్‌కు నిష్క్రమించగా.. అక్కడ్నుంచి సూర్య షో మొదలైంది. 32 బంతుల్లో అర్ధ సెంచరీ సాధించిన సూర్యకుమార్ యాదవ్.. ఆ తర్వాత మరో 50 పరుగులు చేసేందుకు 17 బంతులే ఆడాడు. 49 బంతుల్లోనే శతకబాదిన సూర్యకుమార్ యాదవ్ టీ20 కెరీర్‌లో రెండో సెంచరీ ఖాతాలో వేసుకున్నాడు. ఆఫ్‌స్టంప్‌కు ఆవల పడిన బంతులను అలవోకగా లెగ్ సైడ్ సిక్సర్లు సంధించిన సూర్య.. అవే బంతులను హాఫ్ స్కూప్ షాట్లతో థర్డ్‌మ్యాన్ దిశగా బౌండరీ బాది అందరిని ఆశ్చర్యపరిచాడు. ఇక శ్రేయస్ అయ్యర్ (13), హార్దిక్ పాండ్య (13)లు ఆశించిన ప్రదర్శన చేయలేదు. చివరి ఓవర్లో సూర్యకు అవకాశం దక్కలేదు. ఇదే సమయంలో హార్దిక్, హుడా,సుందర్ వికెట్లతో సౌథీ హ్యాట్రిక్ వికెట్లు ఖాతాలో వేసుకున్నాడు. కివీస్ బౌలర్లలో సౌథీ (3/34), ఫెర్గుసన్ (2/49)లు రాణించారు.

బౌలర్ల మెరుపుల్ : 192 పరుగుల ఛేదనలో న్యూజిలాండ్ చేతులెత్తేసింది. ఇన్నింగ్స్ రెండో బంతికే ప్రమాదకర ఫిన్ అలెన్ (0)ను అవుట్ చేసిన భువనేశ్వర్ కుమార్ భారత్‌కు బ్రేక్ ఇచ్చాడు. మరో ఓపెనర్ డెవాన్ కాన్వే (25, 22 బంతుల్లో 3 ఫోర్లు) సైతం దూకుడుగా ఆడలేకపోయాడు. కెప్టెన్ కేన్ విలియమ్సన్ (61, 52 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ సెంచరీ సాధించాడు.

కానీ పరిస్థితులకు తగినట్టు ఆడటంలో కేన్ ఆడటంలో పూర్తిగా విఫలమయ్యాడు. గ్లెన్ ఫిలిప్స్ (12)ను చాహల్ వెనక్కి పంపటంతో మ్యాచ్ పూర్తిగా భారత్ చేతుల్లోకి వచ్చింది. స్పిన్నర్ దీపక్ హుడా నాలుగు వికెట్లతో కివీస్‌ను విలవిల్లాడించగా, చాహల్ రెండు వికెట్లు ఖాతాలో వేసుకున్నాడు. ఏ దశలో లక్ష్యం దిశగా దూసుకెళ్లని న్యూజిలాండ్ 18.5 ఓవర్లలోనే కుప్పకూలింది. 65 పరుగుల తేడాతో న్యూజిలాండ్‌పై భారత్ ఘన విజయం సాధించింది.

గాయపడిన ఆటగాళ్లను హాస్పటల్ కు తరలిస్తున్న సహాయక సిబ్బంది

ఇండియా రేసింగ్ లీగ్ రద్దు

పలువురు రేసర్లకు గాయాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎంతో ప్రతిష్టాత్మకంగా హైదరాబాద్‌లో ప్రారంభించిన ఇండియా రేసింగ్ లీగ్ అర్థాంతరంగా రద్దయింది. శనివారం టెస్ట్ రేస్‌లు నిర్వహించగా ఆదివారం వివిధ కారణాలతో తీవ్ర జాప్యం జరిగింది. దీంతో అనుకున్న సమయానికి రేస్‌లు పూర్తికాలేదు. ఆదివారం ఉదయం తొమ్మిది గంటల నుంచి జెకె టైర్స్ ఆధ్వర్యంలో ఫార్ములా-4 రేస్ మాత్రమే నిర్వహించారు. సాయంత్రం వెలుతురు సరిగా లేకపోవడంతో ఎలాంటి రేస్‌లు నిర్వహించలేదు. లీగ్ నిర్వహణకు రెండ్రోజులు మాత్రమే అనుమతి ఉండడం.. క్వాలిఫయింగ్ రౌండ్‌లో ఆలస్యం కారణంగా ప్రధాన రేసింగ్ నిలిచిపోయింది. దీంతో ఇండియా రేసింగ్ లీగ్‌ను రద్దు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు.

ఆదివారం ఉదయం జరిగిన పోటీలో పలువురు రేసర్లు గాయపడ్డారు. ఒక మహిళా రేసర్ తీవ్రంగా గాయపడటంతో అంబులెన్సులో ఆసుపత్రికి తరలించారు. ఫార్ములా ఇ- రేసింగ్ వచ్చే ఏడాది ఫిబ్రవరి 11న హైదరాబాద్‌లోనే జరగనుంది. కాగా, ఆదివారం సెలవుదినం కావడంతో కార్ల రేసింగ్ తిలకించేందుకు పెద్దఎత్తున ప్రేక్షకులు ట్యాంక్‌బండ్ పరిసరాలకు చేరుకున్నారు. విఐపి పాస్‌లు, టికెట్లు కొనుగోలుచేసిన వారిని హౌస్‌ఫుల్ అని గ్యాలరీలోకి పోలీసులు అనుమతించలేదు. పోలీసు అధికారులు, వారి కుటుంబ సభ్యులే గ్యాలరీలో సరిపోయారని మాకెందుకు టికెట్లు అమ్మారని పలువురు నిర్వాహకులతో వాగ్వాదానికి దిగారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68